


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :19 సంచిక: 11 హైదరాబాద్ 2020 ఫిబ్రవరి పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# జంట నగరాలలో బాబా జన్మదినోత్సవాలు

బాబా జన్మదినోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 22న సికింద్రాబాద్ కేంద్ర ఆధ్వర్యంలో సాయంత్రం 5.30 నుండి 8.30 వరకూ ప్రత్యేక సత్సంగ్ శ్రీ మర్రి క్రిష్ణ హాలులో నిర్వహిస్తున్నారు. అలాగే, ఆ మర్నాడు అంటే, ఫిబ్రవరి 23న మల్కాజ్‌గిరి బాబా కేంద్రంలో సాయంత్రం 5.30 నుండి 8.30 వరకూ, ఫిబ్రవరి 24న సాయంత్రం 4.30 నుండి 6.30 వరకూ జూబ్లి హిల్సు బాబా కేంద్ర సమీపంలో నగర సంకీర్తన కార్యక్రమం పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. ఫిబ్రవరి 25 తెల్లవారుఝామున 4 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జూబ్లి బాబా కేంద్రంలో ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమాలు, ఆ రోజు సాయంత్రం 6 నుండి 8.30 వరకూ కోఠి సెంటర్‌లో సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శ్రీ రాజేంద్రమెహెర్ తెలిపారు.

**రక్తదాన శిబిరం...**కాగా, మార్చి 1న ఉదయం 8 నుండి 11.30 వరకూ కోఠి మెహెర్ సెంటర్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువత ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొనవల్సినదిగా ఆయన అన్నారు.

# ధర్మవరం సెంటరు

**2020 జూన్ 26,27,28 తేదీలలో మూడు రోజుల ప్రేమిక సహవాస్**

ప్రియతమ శ్రీ అవతార్ మెహెర్‌బాబావారి ప్రేమిక సహవాస్ ధర్మవరం పట్టణంలో 2020 జూన్ 26,27,28 తేదీలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు. ప్రేమిక సహవాస్‌లో బాబా ప్రేమికులందరూ పెద్దసంఖ్యలో పాల్గొనవలసినదిగా కార్యక్రమ నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు, శ్రీమతి పి.ఆర్.సుజాత-97030 30808, శ్రీ జి.శశిధర్-94410 66213, శ్రీ ఎ. రమేష్-94931 57799, శ్రీ జి. మోహన్‌దాస్-92474 98945, శ్రీమతి ఆర్. సరస్వతి-94404 97566, శ్రీ సి. మారుతి-99088 75579, శ్రీ జి. అరవింద్-94402 54182, శ్రీ పి. వెంకటేష్-94409 26526 సంప్రదించగలరు.

# హెల్ప్‌లైన్

**మెహెర్‌బాబా పత్రికకు సంబంధించి సూచనలు, సలహాలు లేదా చిరునామాలలో మార్పులు ఇతరత్రా తెలియజేయాలనుకునేవారు శ్రీ జగన్నాథరావు, కార్యదర్శి, మల్కాజ్‌గిరి బాబా కేంద్రం, ఫోన్ - 09490950014, లేదా 9989708441కు తెలియజేయగలరు.**

## బాబా సందేశం

**To get nearer and nearer to God, you have to get further and further away from 'I, 'My', 'Me' and 'Mine'.**

****

**భగవంతునికి చేరువ కావాలంటే 'నేను', 'నాయొక్క' 'నన్ను', 'నాది' అను వాటికి దూరంగా వుండాలి.**


గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. 51వ అమరతిథి వేడుకలు 6-08
3. భూదేవి పులకరించేనూ..గీతం 09
4. మెహెరాబాద్ సహవాస్ 10-14
5. జూబ్లి బాబా కేంద్రానికి ట్రస్టు అవసరమా? 15-16
6. మా మాటలు 17-19
4. లార్డ్ మెహెర్ 20-28
5. మా ఆస్ట్రేలియా యాత్ర 29-34
6. బాబా జన్మదినోత్సవాలు 35-39
7. జీవిత సభ్యత్వం 40



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# గుంటూరు బాబా కేంద్ర 56వ వార్షికోత్సవం

గుంటూరు బాబా కేంద్ర 56వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సహవాస్ కార్యక్రమాన్ని 2020 మార్చి 1న ఉదయం 9.30 నుండి 2 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 6.30 నుండి 8.30 వరకూ ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ ఎ. జనార్ధనరావు, నిజామాబాద్ హాజరవుతున్నారని తెలిపారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే, అవతారుని 126 జన్మదినోత్సవం సందర్భంగా ప్రేమిక సత్సంగ్ కార్యక్రమాలు 16 రోజులపాటు ఫిబ్రవరి 15 నుండి మార్చి 1 వరకూ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

# వాట్సప్ - 99595 53218

మెహెర్‌బాబా పత్రికలో ప్రచురణార్థం మీరు పంపదల్చుకున్న సమాచారాన్ని వాట్సప్ నంబరు 99595 53218 ద్వారా పంపగలరు. మీరు పంపుతున్న సమాచారంపై **"ప్రచురణార్థం"** అని ప్రత్యేకంగా పేర్కొనడం మరచిపోవద్దు. ప్రతినెలలో 10వ తేదీలోగా ఆయా సమాచారం మాకు అందేలాగా పంపవల్సింది. మీ బంధు మిత్రుల్ని కూడా ఈ గ్రూపులో సభ్యులుగా చేర్పించండి!! బాబా సమాచారాన్ని అందజేయండి. పత్రికను ప్రతినెలా 25వ తేదీన సికింద్రాబాద్‌లోని పోస్టాఫీసు వారికి అందజేస్తున్నాం. కాగా, పత్రిక మీకు ప్రతినెలా 30వ తేదీలోగా బట్వాడా కావాల్సివస్తుంది.
ఏ కారణంగానైనా పత్రిక అందని పక్షంలో మీ దగ్గరలోని పోస్టుమ్యాన్‌తో కాకుండా, ఫోస్టాఫీసులో ఫిర్యాదు చేయవల్సింది. కాగా పత్రికలోని కొన్ని ముఖ్యమైన పేజీలను ప్రతినెలా 18వ తేదీలోగా ఈ గ్రూపులో పోస్టు చేస్తున్నాం. దయచేసి పరిశీలించండి!!

# పత్రిక బట్వాడాలో తేది మార్పు

మెహెర్‌బాబా పత్రిక గత కొన్ని సంవత్సరాలుగా ప్రతినెలా 19 లేదా 20 తేదీలలో పోస్టు చేస్తున్నాం. ఐతే, పోస్టలు శాఖవారు 2020 జనవరి నుండి ప్రతినెలా 25 లేదా 26 తేదీలలో పోస్టు చేసేందుకు అనుమతి ఇచ్చారు. కాబట్టి, ప్రతినెలా హైదరాబాద్‌లో మెహెర్‌బాబా పత్రికను 25 లేదా 26వ తేదీలలో పోస్టు చేస్తున్నాం కాబట్టి, మెహెర్‌బాబా పత్రిక మీ ఇంటికి ఇకపై 30వ తేదీలలోగా వస్తుంది.
పత్రిక బట్వాడాలో వచ్చిన ఈ స్వల్ప మార్పును గమనించ ప్రార్థన.

# సంపాదకీయం ప్రేమ యోగం

1958 ఫిబ్రవరి 14 నుండి 19 వరకూ మెహెరాబాద్‌లో హిందీ, మరాఠీ ప్రేమికులతో ప్రత్యేక సహవాస్ ఆరు రోజులపాటు జరిగింది. ఫిబ్రవరి 18న, అంటే సహవాస్ ముగింపుకు ముందు రోజున సహవాసీలను ఉద్దేశించి బాబా ఓ ప్రత్యేక ప్రవచనము ఇస్తానని చెప్పారు. ఈ ప్రవచనములోని విషయాలు ఇంతక్రితం అవతారాలలో ఎక్కడా చెప్పలేదన్నారు. ఇదొక ఆధ్యాత్మిక మర్మమని పేర్కొనాలి. లార్డ్ మెహెర్ వాల్యూం 7, పేజి 3809లో ఇంగ్లీషులోవున్న ఈ ప్రవచనాన్ని స్వేచ్ఛానువాదంగా ఈ సంచికలోని మెహెరాబాద్ సహవాస్ శీర్షికలో ప్రచురించడమైంది. దయచేసి పరిశీలించండి. ఈ ప్రవచనంలో బాబా **split personality** గురించి, **Split Ego / Split I / False 'I'** గురించి సోదాహరణంగా చెప్పారు. **బాబా ఏమన్నారంటే, Split Ego / Split I / False 'I'** ప్రతిఒక్కరిలో **తప్పక వుంటుందని బాబా స్పష్టం చేశారు. split personality** అందరిలోనూ వుండక పోవచ్చేమోగానీ, **ద్వంద్వ అహంకారం (Split Ego / Split I ) మాత్రం అందరిలో వుంటుంది అని బాబా ప్రకటించారు.** పరమాత్మ ఒక్కడే – **REAL "I"**. ఐతే, నిజమైన నేను (**REAL "I"**) తో పాటు ప్రతి ఒక్కరిలో **False 'I'** కూడా వుంటుంది. పరమాత్మ (**REAL "I"**) నుండే అసంఖ్యాకమైన **False 'I'** ఏర్పడింది. దీనివల్లనే వేరు వేరు వ్యక్తులుగా, నేను – మీరు వేరుగా, అనేక విధాలుగా భిన్నమైన వ్యక్తులుగా కనపడుతున్నారు. అందరూ **REAL "I"** నుండి వచ్చినవారైనా, **ఇంతమంది వేరు వేరుగా ఎందుకు కనిపిస్తున్నారు? ఈ విభజన ఎక్కడ్నుంచి వచ్చింది? అని బాబా వివరిస్తూ ఈ విభజనే లేకపోతే, అందరిలో ఉన్న శాశ్వతమైన, అవిభాజ్యమైన పరమాత్మ ఒక్కడే అనే REAL "I" ని మీరెలా తెలుసుకుంటారు? అని సహవాసీలను బాబా ప్రశ్నించారు.** ఈ అసత్యపు నేను (**FALSE "I"**)కు అజ్ఞానం మద్దతు ఇస్తుంది. అనేక యోగాభ్యాసాలున్నాయి. అన్నింటి లక్ష్యం ఒక్కటే. **FALSE "I"** పోగొట్టుకుని, **REAL "I"** ని తెలుసుకోవాలన్నదే లక్ష్యం. **ఈ లక్ష్య సాధనలో ఎన్ని రకాల యోగాలు అనుసరించినా REAL "I"** ని తెలుసుకోలేరని బాబా స్పష్టంగా చెప్పారు. మరి ఎలాగా? అనే ప్రశ్నకు జవాబుగా **ప్రేమ యోగం అనుసరించడం ఉత్తమోత్తమం అని ఆయన సూచించారు.** ప్రేమ యోగం ద్వారా ప్రేమికుడు తన త్యాగనిరతి ద్వారా అసత్యపు నేను తొలగించుకుని సత్యమైన నేనులో తనకు తానుగా ఐక్యమవుతాడని, ప్రేమావతారుడు ప్రకటించారు.

****

**బాబావారి ప్రవచనములు ఆచరణలో అమలుచేయడానికి కృషి చేద్దాం!!**

# 51వ అమరతిథి వేడుకలు




అవతారుని 51వ అమరతిథి వేడుకలు ఘనంగా ముగిశాయి. 2020 జనవరి 30 నుండి ఫిబ్రవరి 2 దాకా మెహెర్ ప్రేమికులతో మెహెరాబాద్ కళకళలాడింది. దేశం నలుమూలల నుండి ప్రేమికులు అవతారుని దర్శనార్థం పెద్దఎత్తున తరలి వచ్చారు. ఐతే, ఈ దఫా అమరతిథికి విచ్చేసినవారి సంఖ్య గతంతో పోల్చుకుంటే తక్కువేనని చెప్పాలి. మెహెరాబాద్‌లో జనవరి 30, 31 తేదీలలో రాత్రిపూట చలి చాలా ఎక్కువగా వుంది. రాత్రిపూట ఉష్ణోగ్రత కనిష్ఠస్థాయిలో 15 – 18 డిగ్రీల నడుమ వుందని చెప్పాలి. వాతావరణంలో వచ్చిన మార్పు వల్ల చాలామంది ప్రేమికులు, ముఖ్యంగా వయస్సురీత్యా పెద్దవాళ్ళు రాబోయే వేసవికాలం ఏప్రిల్ – మే నెలలలో మెహెరాబాద్‌ని సందర్శించాలని నిర్ణయించుకున్నారు.

విచ్చేసిన ప్రేమికులందరికీ ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ స్వాగతం పలికారు. జనవరి 30 సాయంత్రానికి బాబా ప్రేమికులందరూ, ముఖ్యంగా తెలుగు ప్రాంతాలవారందరూ మెహెరాబాద్‌కి చేరుకున్నారు. తెలుగువారందరికీ యం.పి.ఆర్.కి సమీపంలోని ఆరుబయలు ప్రదేశంలో పలుచని గుడ్డ డేరాలలో బస ఏర్పాటు చేశారు. సిమెంటు కాంక్రీటు గదుల్లో వుండేవారు కూడా ఆనాటి చలిని తట్టుకోలేక చాలా ఇబ్బంది పడ్డారు. అలాంటిది న్యూ సైట్‌లో బస వున్న వారెంత కష్టపడి వుంటారో ఊహకందని విషయం కాదు. కాగా, అవతారుని దర్శనానికై

జనవరి 30 అర్థరాత్రి నుండి జనవరి 31 వరకూ మెత్తం 45 టోకెన్లు ఇచ్చారు. ప్రతి ఏడాది మాదిరి ఒక్కో టోకెను నంబరును 500 మందికి కేటాయించారు. ఒకటవ నంబరు తీసుకున్నవారు రాత్రి 12 గంటల సమయంలో బాబా దర్శనానికై క్యూలో నిల్చున్నారు. కాగా, 11, 12, నంబర్లువారికి ఉదయం 7 గంటలలోపునే దర్శనం లభించింది. టోకెను నంబరు 30 –35 వారికి సాయంత్రం 5 గంటలు దాటాకగాని దర్శనం లభించలేదు. అవతారుని సమాధి లోపల నిల్చుని బాబాని దర్శించుకునేలా అక్కడున్న పాలరాతికి అడ్డంగా వుంచిన చెక్క నిర్మాణం క్యూ వేగాన్ని పెంచుతుందని నిర్వాహకులు భావించారు. ట్రస్టువారిచ్చిన 45 టోకెన్ల ద్వారా రమారమిన 22 వేల మంది మాత్రమే క్యూలో నిల్చుని బాబాని దర్శించుకున్నారు. సమీప గ్రామాల నుండి వచ్చిన మరో 20 వేల మంది బాబా సమాధి ప్రాంగణం నుండే అవతారుడ్ని దర్శించుకుని వెనుతిరిగారని చెప్పాలి. జనవరి 30 నుండి ఫిబ్రవరి 1 దాకా అమరతిధి వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 30 నుండి వరుసగా ప్రతి రోజూ అమరతిధి వేదికపై ఒక్కొక్కరోజు ఒక్కో భాష చొప్పున తెలుగుతో సహా పలు బాషలలో ప్రార్థనలు చదివారు. తెలుగువారు అవతారుని సందేశాలపై పాటలు, లఘునాటికలు,చిన్నారుల నృత్యాలు ప్రదర్శించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల నుండి పలువురు ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. హైదరాబాద్ ప్రేమికులు శ్రీ గోపి బృందం నేతృత్వంలో చక్కని భజన గీతాలాపన జరిగింది. అలాగే, శ్రీమతి పద్మావతి, మెహెర్ నిధి, పి. రామచందర్, కెయస్ నాయుడు, శ్రీ పండుగ రమణ, హైదరాబాద్ తదితరులు పాడిన గీతాలు ప్రశంసలు పొందాయి. ఐతే, సాంస్కృతిక కార్యక్రమాలు అధికభాగం నాసిరకంగా వున్నాయనే చెప్పాలి. పాట పాడతామన్న అర్జీదారులందర్నీ ఏకగాటినకట్టి సాదరంగా వేదికపై ఆహ్వానించడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పొచ్చు. మరోవిశేషం ఏమంటే సమయం తక్కువగా వుందని, పాటపాడేవారికి 2 నిముషాల్లోనే మైక్ కట్ చేయడం గత ఏడాది మాదిరిగానే చేశారు. ఏ గీతమైనా కనీసం 3 నిముషాల నిడివి వుంటుందని కార్యక్రమ నిర్వాహకులు గ్రహించాలి. ఏదిఎలాగున్నా హైదరాబాద్ యువత ఈ కార్యక్రమాలన్నింటినీ యావత్తు ప్రపంచం వీక్షించేలా తగిన ఏర్పాట్లు చేసింది. బాబా సమాధి ప్రక్కన గల బాబా గదిని జనవరి 30, 31 తేదీలలో ప్రేమికులు బారులు తీరి దర్శించుకున్నారు. అలాగే, దిగువ మెహెరాబాద్‌లో ఏర్పాటు చేసిన పలు ఎగ్జిబిషన్ స్టాల్సుని కూడా ప్రేమికులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. శ్రీ కొల్లి రామారావు , విజయనగరం, శ్రీ మోహన్‌దాస్, ధర్మవరం, అలాగే నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, తదితర జిల్లాల నుండి బాబా ప్రేమికులు పెద్ద బృందంగా హాజరయ్యారు. వీరిలో చాలామంది

స్వచ్ఛంద సేవాదళంగా తమ సేవలు అందజేశారు. ఈ ఏడాది రమారమిన 1200 మంది బాబా ప్రేమికులు వాలంటీర్లుగా సేవలందించారని శ్రీధర్ కేల్కర్ అన్నారు. అమరతిథి వేదికపై ఆంధ్రా సెంటర్ తరఫున శ్రీ బాలగోపాల మెహెర్‌ఈసా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నింటికంటేమిన్నగా, ఎగువ మెహెరాబాద్‌లోని విజయవాడ వారి రెస్టారెంటు మునుపటికంటే ఎక్కువగా పలువుర్ని ఆకర్షించింది. ఆంధ్రా రెస్టు హౌసు పూర్తిస్థాయిలో 450 మందికి భోజన – బస ఏర్పాటు చేశింది. అమరతిథి మూడ్రోజులూ బాబా దర్శనార్థం ఎగువ మెహెరాబాద్‌కి వెళ్ళేవారందరికీ ఉచిత రవాణా సౌకర్యం, వయస్సుమీరిన వారందరికీ పరుపులు, మంచాలు ఏర్పాటు చేశారు. నీటి లభ్యతలేని ఈ ప్రాంతంలో, ఆ సమస్య ఎరుగని రీతిలో రెస్టు హౌసు నిర్వాహకులు కృషి చేశారు. నిజామాబాద్ జిల్లాలోని వర్ని గ్రామం నుండి, తూర్పు గోదావరి జిల్లాలోని జొన్నాడ తదితర గ్రామాల నుండి విచ్చేసిన బాబా ప్రేమిక బృందం రెస్టు హౌసులో చక్కని భోజన–అల్పాహార సౌకర్యం కల్పించారు. ఫిబ్రవరి 1 సాయంత్రం నుండి బాబా సమాధి లోపల ఏర్పాటు చేసిన కొయ్యను తొలగించారు. ఫిబ్రవరి 2 సాయంత్రం, ఆ మర్నాడు బాబా ప్రేమికులు బాబాకు తిరిగి ప్రణమిల్లి శెలవ్ తీసుకున్నారు.

# నరసరావుపేటలో 126 రోజుల జన్మదినోత్సవాలు

నరసరావుపేట బాబా కేంద్రంలో అవతారుని 126 జన్మదినోత్సవం సందర్భంగా 2019 అక్టోబరు మాసం నుండి 126 రోజులుగా 2020 ఫిబ్రవరి 25 వరకూ, ప్రతి రోజూ ప్రతి ఇంటా అన్నట్లు బాబా సత్సంగ్ కార్యక్రమాలు బహు వేడుకగా నిర్వహించినట్లు శ్రీ వంకాయల అచ్యుతరావు తెలిపారు. ఈ సందర్భంగా పలుసార్లు సాంస్కృతిక కార్యక్రమాలు, బాబా సందేశాలపై లఘు ప్రసంగాలు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. 1961 డిసెంబరులో ప్రపథమంగా నరసరావుపేటలో ప్రారంభించిన మెహెర్ కేంద్రం 2021 డిశెంబరు నాటికి 60 సంవత్సరాల వేడుకలకు సిద్ధమౌతోందని, గత ఆరవై సంవత్సరాలుగా బాబా కేంద్రాన్ని స్థాపించిన శ్రీ పెమ్మరాజు సుందరశివరావు, శ్రీ వంకాయల నరసింహారావు, శ్రీ నాగసరపు రామచంద్రరావు, ఇలా పలువురి బాబా ప్రేమికుల అడుగుజాడలలో బాబా కార్యక్రమాలను ఘనంగా నరసరావుపేట పట్టణంలో నిర్వహిస్తున్నామని శ్రీ అచ్యుతరావు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలలో బహు అరుదుగా 126 రోజులుగా అవతారుని జన్మదినోత్సవాలు ప్రతినిత్యం ప్రతి ఇంటా అన్నట్లు నిర్వహించిన నరసరావుపేట బాబా కేంద్ర నిర్వాహకులు అభినందనీయులు.

# భూదేవి పులకరించేను

రచన– శ్రీ యం. సుబ్బరామయ్య మోహన రాగం

భూదేవి పులకరించేను.
మహార్ణవములు పొంగిపొరలేను
గగనవీధుల వెలుగునిండెను
సృష్టి అంతయు పరవశించెను
ఏమి వింతయో జూడరా
ఏమి భాగ్యమొ తెలియరా ॥భూ॥

ధరణి భారము శిరము నిదుకొని
దైత్య భావము రూపుమాపగ
మానవాళి హృదయ సీమల
ప్రేమవాహిని పల్లవించగ
మహిని వెలసెను మహా విష్ణువు
మెహెరు పేరున మౌనవ్రతుడై ॥భూ॥

ముముక్షువులకు మహాత్ములకు
యోగులకు విరాగులకు ను
మస్తులకు ఉన్మత్తులకును
పేదలకు నిర్భాగ్యులకును
దివ్యకరుణను పంచినావె
దివికిమార్గమై నిలచినావె ॥భూ॥

కన్నులార నిన్ను గాంచని
మందమతులము మూఢులముగా
నీదు సిరులు మరులు నెరుగని
పేదలము నిర్భాగ్యులమురా
జాలి గొని మమ్మేలు కొనగా
వేదుకొందుము మెహెరు దేవా ॥భూ॥

# మెహెరాబాద్ సహవాస్

(గత సంచిక తరువాయి)

## Split Ego / Split I

**1958 ఫిబ్రవరి 18, మధ్యాహ్నం 3 గంటల సమయం.**

ఆ రోజున Split Ego / Split I గురించి బాబా తన ప్రవచనము ఇస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బాబా ఈ సందేశాన్ని సోదాహరణంగా ఇలా వివరించారు. ఆనాటి సహవాస్ వేదికపై సాకోరి నుండి వచ్చిన గోదావరిమాయి కూడా బాబా ప్రక్కనే కూర్చునుంది. బాబాకు ఎదురుగా సహవాసీలు కూర్చున్నారు.
"ఈ ప్రవచనము గురించి నేను ముందుగానే మండలివారికి చెప్పాను.
వారు ఈ అంశాన్ని ఇంగ్లీషులో చదివి మీకు వినిపిస్తారు.
ఆ తర్వాత హిందీలో, మరాఠీలో అనువాదం వుంటుందని" బాబా అన్నారు.
ఈ ప్రవచనములో నేను ఓ కొత్త విషయం **Split Ego / Split I / False 'I'** గురించి చెబుతున్నాను. ఈ పదాన్ని కూడా ఇంతక్రితం వరకూ మీరు ఎన్నడూ వినివుండరు. అంటే, గత అవతారకాలంలో కూడా ఈ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించ లేదు. ఇది చాలా కొత్త విషయం.
ఈ అవతారకాలంలో నేను స్పష్టంగా విశదీకరిస్తున్నాను. శ్రద్ధగా ఆలకించండి.
ఆ పిదప, ఇంగ్లీషులో సిద్ధంగా వున్న బాబావారి సందేశాన్ని చదివి వినిపించడం ప్రారంభించారు.

***

మీలో చాలామంది దంద్వ ప్రవృత్తి **(split personality)** గురించి విని వున్నారు. అది చాలా సాధారణమైన విషయం.
దంద్వ ప్రవృత్తిలో ఒక వ్యక్తి ఒక రోజు ఒకలాగా,
ఆ మర్నాడు మరోలా వుంటాడు. అంటే, ఒక రోజున చాలా ఆనందంగా వుంటాడు. ఆ మర్నాడు లేదా ఆ మరుక్షణంలోనే దుఖసాగరంలో వున్నట్లు విచారంగా వుండవచ్చు. ఒకరోజన చాలా మంచి పనులు చేసినవాడే, ఆ మర్నాడు ఎన్నడూ చేయకూడని పనులు చేయవచ్చు.
దీన్నే **ద్వంద్వ ప్రవృత్తి (split personality)** అంటాము. అయితే,
ఈ దంద్వ ప్రవృత్తితో **(split personality)** పోల్చితే,
ద్వంద్వ అహంకారం **(Split Ego / Split I / False 'I' )** అనేది
ఓ కొత్త విషయం.

"మీలో చాలా మంది డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ గురించి విని వుంటారు.
మంచి – చెడూ ఒకే మనిషిలో మిళితమై అతనిలో వుంటాయి.
**ద్వంద్వ ప్రవృత్తికి (split personality)** డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్
ఒక గొప్ప వుదాహరణగా నిలుస్తాడు.
ఈ ద్వంద్వ ప్రవృత్తి **(split personality)** లాగానే,
ద్వంద్వ అహంకారం **(Split Ego / Split I / False 'I' )**అందరిలోనూ వుంటుంది.
ద్వంద్వ ప్రవృత్తి **(split personality)** అందరిలోనూ వుండక పోవచ్చేమోగానీ,
**ద్వంద్వ అహంకారం (Split Ego / Split I / False 'I' ) మాత్రం
ప్రతిఒక్కరిలో తప్పక వుంటుందని బాబా స్పష్టం చేశారు.**

****

## REAL "I" - False 'I'

అందరిలో వున్న ఆత్మ ఒక్కటే. పరమాత్మ ఒక్కడే.
పరమాత్మ నిజమైన సత్యం **(REAL "I")**. ఆత్మ అవిభాజ్యమైనది.
ఐతే, నిజమైన సత్యం **(REAL "I")** తో పాటు
ప్రతి ఒక్కరిలో **False 'I'** కూడా వుంది.
పరమాత్మ **(REAL "I")** నుండే అసంఖ్యాకమైన **False 'I'** ఏర్పడింది.
దీనివల్లనే వేరు వేరు వ్యక్తులుగా, నేను – మీరు వేరుగా,
అనేక విధాలుగా భిన్నమైన వ్యక్తులుగా వ్యక్తమవుతోంది.
వాస్తవంగా, భగవంతునిలో వున్న "నేను" **(REAL "I")**
ఒక్కటి మాత్రమే సత్యం.
భగవంతుని స్వరూపమైన ఈ "నేను"కి **(REAL "I")**
వేరే భావనంటూ ఏమీలేదు.
ఇక్కడ కూర్చున్న మీరందరూ కూడా అవిభాజ్యమైన సత్యంలోని **(REAL "I")**
నుండి వచ్చినవారే. మీరందరూ ఆ సత్యమైన నేనులోని ఓ భాగమే అన్నారు బాబా.

***

**అందరూ ఒకటే అయితే, ఇంతమంది వేరువేరుగా ఎలా కనిపిస్తున్నారు?
ఈ విభజన ఎక్కడ్నుంచి వచ్చింది? అని బాబా ప్రశ్నిస్తూ,
ఆయన జవాబు ఇలా ఇచ్చారు. ఈ విభజనే లేకపోతే,
అందరిలో ఉన్న శాశ్వతమైన, అవిభాజ్యమైన పరమాత్మ ఒక్కడే అనే
సత్యమైన నేను, (REAL "I") ని ఎలా తెలుసుకుంటారు? అని
సహవాసీలను బాబా ప్రశ్నించారు.**

పరమాత్మ ఒక్కడే. అదే సత్యం. **(REAL "I")**
ఐతే, మీలో వున్న ద్వంద అహంకారం **(Split Ego / Split I/ FALSE "I" )** మాత్రం అసత్యమైనది. **Split Ego / Split I** వల్లనే ఈ విభజన,
మీరు వేరు, ఇతరులు వేరు అని భిన్న వ్యక్తుల్ని చూస్తున్నారని బాబా అన్నారు.
పరమాత్మ ఒక్కడే అని చెప్పుకున్నాం కదా!! ఆ పరమాత్మనే **(REAL "I")**
అసంఖ్యాకమైన అసత్యపు నేనుగా **(FALSE "I")** విడిపోయింది.
**ఈ అసత్యపు నేను నుండి మనం ఏం ఆశించాలి?**
ఈ **అసత్యపు నేను** అనేదే అసత్యం కాబట్టి,
ఇది ప్రతి అసత్యానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.
బాబా ఇంకా ఇలా అన్నారు.
బాబా తనలోని "నిజమైన నేను" ప్రతిఒక్కరిని ఏకభావంతో చూస్తుంది.
కానీ, మీలో వున్న నిజమైన నేను చీలిపోయి,
అసత్యపు నేనుగా **(Split Ego / Split I )** మారింది కాబట్టి,
మీరు అందరిలో వున్న సత్యమైన నేనుని **(REAL "I")** చూడలేరు.
సరికదా, సర్వత్రా ప్రతివారిలో "**మీరు వేరు – వారు వేరు**" అనే భావంతో వుంటారని బాబా ప్రకటించారు. క్లుప్తంగా చెప్పాలంటే సత్యమైన నేను **(REAL "I")** (పరమాత్మ) అసత్యమైన నేనులుగా (జీవాత్మలుగా) అసంఖ్యాకంగా అనేక కోణాలలో విభజింపబడింది. ఈ అసత్యపు నేనుకు **(FALSE "I")** అజ్ఞానం, అవివేకం మద్దతు ఇస్తాయి. అలాగే, అసత్యమైన నేను మూడు మాధ్యమాల ద్వారా 1) స్థూల శరీరము, 2) సూక్ష్మ శరీరము, 3) మానసిక శరీరము అంటే మనస్సు ద్వారా తన భావాలను వ్యక్తపరుస్తుంది. మరోమాటగా చెప్పాలంటే, అజ్ఞానం సహాయంతో సత్యమైన నేను నుండి ఏర్పడిన అసత్యపు నేను అన్నింటా తనకు కావల్సినంత ఆనందాన్ని వెతుక్కుంటుంది. ఇలా ఆనందాన్ని పొందుతున్న క్రమంలోనే అనేక కష్టాలు బాధలు భరిస్తుంది. ఐతే, చివరకి ఏమౌతుంది?
కడకు సత్యమైన నేను విసుగెత్తిపోయి, అసత్యపు నేనుగా ప్రవర్తించడం ఆపివేస్తుంది.
ఎప్పుడైతే సత్యమైన నేను **(REAL "I")** అసత్యపు నేనుగా ప్రవర్తించడం ఆపివేస్తుందో,
తన నిజస్థితి – సత్యమైన నేనుకు సంబంధించి తగిన చైతన్యం పొందుతుంది.
ఈ ఎరుక శాశ్వతమైనది. అంతేకాకుండా, తాను అప్పటివరకూ అనుభవించిన కష్టాలు, సుఖాలు అన్నీ తన అజ్ఞానం వల్లనే కలిగాయన్న అవగాహన కలుగుతుంది.
సత్యమైన నేను, అసత్యమైన నేనుగా చేసిన పనులు, చూసిన దృశ్యాలు, అనేక అనుభవాలు, ఇతరత్రా అన్నీ కూడా అసత్యం అని తెలుస్తుంది.

## యోగా లక్ష్యం

అన్ని యోగాల లక్ష్యం ఒకటే.
నేను అనే అసత్యమైన అహం పోయి, సత్యమైన నేనును శోధించాలన్నదే లక్ష్యం.
**ఉదాహరణకి ఏరుచ్‌ని తీసుకుందాం.**
ఇతను అంతరాంతరాల్లో సత్యమైన నేను **(REAL "I")** వుంది.
కానీ ఏరుచ్‌గా అతను తనని వేరుగా భావించుకుంటున్నంతసేపూ అది
అసత్యమైన నేను **(FALSE "I")** మాత్రమే.
అయితే ఏరుచ్‌లోని సత్యమైన నేను, అసత్యమైన నేనుని మరచిపోయే ప్రయత్నం చేస్తోందనుకుందాం. ఈ క్రమంలో ఏరుచ్‌గా (అసత్యపు నేనుగా)
ఎందరికో (అసత్యపు నేనులకు) సేవ చేయాలనుకుంటాడు.
ఇలాంటి సేవలనే కర్మ యోగం అంటారు. ఇక్కడ విచిత్రమేమంటే,
ఒక అసత్యమైన నేను (ఏరుచ్) సత్యమైన నేను **(REAL "I")** చేరుకోవడానికి
ఎందరికో (అసత్యమైన నేనులను) సేవచేయాలనుకుంటాడు.
కానీ, కర్మయోగంలో అసత్యమైన నేను మరిన్ని బంధనాలలో చిక్కుకుంటుంది.

## భక్తి యోగం

మరొక యోగం భక్తి యోగం. ఇది ఎలాగంటే అసత్యమైన నేను పాత్రని పోషిస్తున్న సత్యమైన నేను, సత్యమైన నేనుని భక్తితో ఆరాధించాలనుకుంటుంది. ఓ సత్య స్వరూపమైన భగవంతుడా, నిన్ను నేను అందరిలో పూజిస్తాను. నీవే ఏకైక సత్యం. నీకు ప్రణమిల్లుతాను. నీవు అందరిలో వున్నావు. నీవు అనంతుడువు. అపరమితుడవైన అని సత్యమైన నేనుని భక్తితో పూజిస్తాడు. అయితే ఇక్కడ ఏమవుతుందంటే, అసత్యమైన నేను అనేక ఇతర అసత్యమై నేనులను సేవిస్తుంది తప్ప, ఉన్నది ఒక్కటే అయిన సత్యాన్ని మాత్రం కాదు అని అన్నారు మెహెర్‌బాబా. కాగా,
**కర్మ యోగం, భక్తి యోగం అవలంబించడం వృథా అని బాబా చెప్పకనే చెప్పారు.**

## ప్రేమ యోగం

అయితే, ప్రేమ యోగం ప్రత్యేకమైనది. ఇది ఎలాగో వివరిస్తూ బాబా ఇలా అన్నారు.
ప్రేమ పథంలో ప్రేమికుడు తన ప్రియతముని కోసం పరితపిస్తూ, తన ప్రేమలో
తన సరస్వం, తన అసత్యపు నేనుని క్రమంగా పోగొట్టు కుంటాడు.
చివరకు ప్రియతముడినని చేరుకుంటాడని బాబా అన్నారు.
ఇది అర్థం కావాలంటే మళ్ళీ ఏరుచ్‌ని ఉదాహరణగా తీసుకుందాం అన్నారు.

ఈ ప్రేమ పథంలో, ఏరుచ్‌లోని అసత్యమైన నేను
తనలోనే వున్న సత్యమైన నేనుని ప్రేమించటం మొదలు పెడుతుంది.
ఏరుచ్‌లో నేను అనే భావంతో "అసత్యపు నేను",
అలాగే, అతనిలో నిజమైన నేను **(REAL "I")** కూడా వుంది కదా!!
కాని నిజానికి అక్కడ రెండు "నేనులు లేవు".
ఏరుచ్ (అసత్యమైన నేను) సత్యమైన నేనుపై ప్రేమ పెంచుకుంటాడు.
ఈ ప్రేమ క్రమేణా పెరుగుతూ, ఆ ప్రేమలో తనను తాను మరచిపోయి,
అసత్యపు నేను కరిగిపోతుంది. అసత్యపు నేను తొలగిపోయి సత్యమైన నేనులో
తనకు తానుగా ఐక్యమవుతాడని బాబా అన్నారు.

****

ఆంతరంగికంగా (Inner Experience) సత్యమైన నేను **(REAL "I")** కోసం పొందే అనుభూతులు దైవీ మేలుకొల్పును (Divine awakening) కలిగిస్తుందని బాబా అన్నారు. ఐతే, సూక్ష్మ భూమికల్లో, (Subtle Planes) ఆంతరంగికంగా సత్యమైన నేను **(REAL "I")** కోసం పొందే అనుభూతులు దైవీసంబంధమైన భ్రమని (Divine hallucinatioon), మానసిక భూమికల్లో ఆంతరంగికంగా సత్యమైన నేను **(REAL "I")** కోసం పొందే అనుభూతుల్ని ఆధ్యాత్మిక పీడకల (Spiritual nightmare) అని అభివర్ణించవచ్చని, బాబా తన సందేశాన్ని ముగించారు.

***

బాబావారి సందేశాన్ని చదివి వినిపిస్తున్న సమయంలో బాబా ప్రక్కనే వున్న గుల్మాయి బాబా చెవిలో ఏదో చెప్పడంతో, బాబా చిరునవ్వులు చిందించారు.
ఆ పిదప ఆరంగాం ప్రేమికులు చక్కని భజన చేశారు. ఆ తర్వాత అలోబా లేచి నిలబడి, మైకు దగ్గరకు వెళ్ళి, పర్షియన్ భాషలో ఏదో బిగ్గరగా చదివాడు. అలోబా ఏం చెప్పాడో అతనికి తప్పించి మరెవరికీ అర్థం కాదన్నారు బాబా. ఎందుకంటే అతను పర్షియన్ భాషలో మాట్లాడాడు కదా అని చమత్కరించారు.
అ తర్వాత మన్‌సింగ్ థాపా యొక్క కుమార్తె చక్కని పాట పాడింది. బాగా పాడావని బాబా ఆమెను అభినందించారు. ఆ తర్వాత ముంబాయిలోని ఎయిర్ ఫ్రెయిట్ కంపెనీ ప్రతినిధి శ్రీ వ్యాస్ బాబా దర్శనం చేసుకున్నాడు. ఆయన ఈ సహవాస్‌కు వచ్చిన వారందరి తిరుగుప్రయాణం కోసం,మెహెరాబాద్ నుండి ప్రత్యేక రైలు ఏర్పాటు చేశాడని ప్రకటించారు.

**- సశేషం**

# జూబ్లి బాబా కేంద్రానికి ట్రస్టు అవసరమా?

## (శ్రీ బుద్దే క్రిష్ణయ్య, హైదరాబాద్)

శ్రీ బుద్దే క్రిష్ణయ్య, విశ్రాంత సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, హైదరాబాద్ బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ గారికి 2020 జనవరి 21న, ఓ లేఖ రాస్తూ, ఆ లేఖ ప్రతిని మెహెర్‌బాబా మాసపత్రికలో ప్రచురణార్థం పంపారు. ఈ లేఖలో పలు అంశాలు ప్రస్తావించినప్పటికీ, ఆ లేఖలోని ప్రధానాంశాలు కొన్నింటిని మాత్రం పాఠకుల సమాచారం నిమిత్తం ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.

****

మెహెర్‌బాబా ఏర్పాటు చేసిన అహ్మద్‌నగర్, పూణే, అమెరికాలోని మెర్టిల్‌బీచ్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, క్వీన్స్‌లాండ్‌లలో వున్న మెహెర్ హౌస్, మెహెర్ ఎబోడ్ కేంద్రాలు తదితర అనేక బాబా కేంద్రాల ఏర్పాటులో మెహెర్‌బాబా స్వయంగా ఆయా కేంద్రాలకు నిర్ణీత సభ్యులతో ట్రస్టునొకదాన్ని ఏర్పాటు చేయాలని సుస్పష్టంగా ఆదేశించారు. 1959 ఏప్రిల్ 6న బాబా తొలిసారిగా అవతార్ మెహెర్‌బాబా పెర్‌పెచ్యువల్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదేమాదిరిగా పైన పేర్కొన్న ఇతర బాబా కేంద్రాలకు కూడా ట్రస్టును ఏర్పాటుచేసి రిజిష్టర్ చేయించాలని బాబావారు ఆదేశించారు. ఐతే, తెలుగు రాష్ట్రాలలో వున్న పలు బాబా కేంద్రాలు ముఖ్యంగా హైదరాబాద్‌లోని జూబ్లి బాబా కేంద్రం ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలు పైబడుతున్నా, నేటి వరకూ జూబ్లి బాబా కేంద్రానికి ఒక ట్రస్టును ఏర్పాటు చేయలేదు. ఓ తాత్కాలిక మేనేజ్‌మెంట్ కమిటి నిర్వహణలో గత 30 సంవత్సరాలుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 1986 నవంబరు 14న జూబ్లి కేంద్ర ప్రారంభోత్సవం జరిగింది. ఆ సమయంలో అప్పటి కేంద్ర అధ్యక్షులు ఓ తాత్కాలిక కార్యనిర్వాహక కమిటిని ఏర్పాటుచేసి త్వరలో ట్రస్టు డీడ్ నెలకొల్పాలని ప్రతిపాదించారు. కానీ జూబ్లి బాబా కేంద్రానికి ఓ ట్రస్టు ఏర్పాటు చేసిన దాఖలాలు నేటి వరకూ జరగలేదు. ఇది విచారకరం. ఈ మేరకు, తాను పలు సందర్భాలలో ఆంధ్రా సెంటర్ అధ్యక్షులు, కార్యదర్శులకు గుర్తుచేసేలా హెచ్చరిస్తూనే వున్నానన్నారు శ్రీ క్రిష్ణయ్య. ఐనప్పటికీ ఫలితం ఏమీ లేకపోవడంతో చైర్మన్, మెహెర్‌బాబా ట్రస్టు వారి దృష్టికి తీసుకువస్తున్నానన్నారు. అవతార్ మెహెర్‌బాబా జూబ్లి హిల్సు కేంద్రాన్ని సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో నిర్మించడమైంది. ప్రస్తుతం ఈ కేంద్రం విలువ రమారమిన 38 కోట్ల రూపాయలు అంచనా వుంటుందని అన్నారు. 1986 నుండి నేటివరకూ బాబా ప్రేమికులు

చాలామంది బాబా కేంద్రానికి తమ వంతు విరాళాలు అందజేస్తున్నారని, అయితే వారిచ్చే విరాళాలకు 80 జి – ఇన్‌కంటాక్స్ మినహాయింపు లభిస్తున్న దాఖలాలు లేవన్నారు. జూబ్లి హిల్సు కేంద్రానికి ట్రస్టు ఏర్పాటు అవసరమా? అలాంటి అవసరమే లేదని ప్రస్తుత మేనేజ్‌మెంట్ కమిటీ భావిస్తోందా? అనే విషయం ఎన్నిమార్లు వారి వద్ద ఈ ప్రస్తావన తెచ్చినా సరైన జవాబు తనకు చిక్కలేదని శ్రీ క్రిష్ణయ్య అన్నారు. అందుకే చివరాఖరిగా బాబా ట్రస్టు చైర్మన్‌గా మీకు ఈ లేఖ రాయవల్సివచ్చిందని, ఇందుకు ఎవరి మనస్సునైనా నొప్పించితే క్షంతవ్యుండనన్నారు.

అదేమాదిరి తెలుగు రాష్ట్రాలలో గల పలు బాబా కేంద్రాలకు ట్రస్టు ఏర్పాటు చేయాలనుకోవడం ఉభయకుశలోపరని, ఈ విషయమై తగిన సూచనలు,సలహాలు జూబ్లి బాబా కేంద్రానికి బాబా ట్రస్టు, చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్‌ను అందజేయాలని కోరుతూ శ్రీ క్రిష్ణయ్య తన లేఖను ముగించారు.

****

**పాఠకులు తగిన విధంగా స్పందించగలరు !! !!!!**

# అక్షర నిధి

మెహెర్‌బాబా మాస పత్రిక 2001 మేలో ప్రారంభించాం. ఆనాటి నుండి ప్రచురించిన మాస పత్రికలను ప్రతి రెండు సంవత్సరాలకొకసారి, 24 పుస్తకాలను ఒక సంపుటిగా మొత్తం 8 వాల్యూంలను గట్టి బైండ్ చేయించాము. రాబోయే తరాల కోసం ఈ చిన్ని ప్రయత్నం చేయడమైంది. ఐతే, ప్రస్తుతం ఐదవ వాల్యూం నుండి 8వ వాల్యూం వరకు మాత్రమే లభిస్తున్నాయి. బాబా సెంటర్లలో నిర్వహించే గ్రంథాలయాలకు ఇది అపురూప కానుక కాగలదు. అతి తక్కువ సంఖ్యలో వాల్యూంలున్నందున, త్వరలో స్పందించగలరు. మరిన్ని వివరములకు ఫోన్. 995955 3218 సంప్రదించగలరు.

# మెహెర్‌స్థాన్ కొవ్వూరు 57వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ కొవ్వూరు 57వ వార్షికోత్సవం 2020 ఫిబ్రవరి 28న ఉదయం 6.45 నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ ఏర్పాటు చేసినట్లు శ్రీ కోడూరి తులసీ వర ప్రసాద్ గారు ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 8.45 నుండి మెహెర్ దర్శ్‌లో ప్రత్యేక ప్రార్థనలు ఆరతి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ కోడూరి ప్రసాద్ గారు కోరుతున్నారు.

# కలకత్తాలో ప్రేమిక సహవాస్

2020 మార్చి నెల 7, 8 తేదీలలో కలకత్తాలో మెహెర్‌బాబా ప్రేమిక సహవాస్ పెద్దఎత్తున ఏర్పాటు చేసిన సంగతి పాఠకులకు తెలుసు. ఇప్పటి వరకు 600 మందికి పైగా ఈ సహవాస్‌లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కాగా, ఇంకా ఆసక్తిగలవారెవరైనా వుంటే తక్షణం తమ వివరాలను డాక్టర్ నరేంద్ర ప్రసాద్, హైదరాబాద్ (9440602754), శ్రీ మెహెర్ ప్రకాశ్, వైజాగ్, (98496 45057) లేదా శ్రీమతి ఇంద్రాని రాథోర్, కలకత్తా, (92300 75888) కు తెలియజేయవల్సింది.

# గుంటూరు

గుంటూరు మెహెర్ హౌస్ నందు 2020 జనవరి 12న ఆదివారం ప్రతి నెలా ప్రత్యేక సహవాస్ కార్యక్రమములో భాగంగా శ్రీ కూరపాటి మాధవరావు గారి సౌజ్యముతో నిర్వహించబడినది. శ్రీ బి.డి.నరశింహారావు సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం బాబా చిత్రపటముతో మందిర ప్రదక్షిణ, భజన కార్యక్రమము నిర్వహించడమైంది. శ్రీ బి.వి.సుబ్బారావు, శ్రీ బి.ఏ.కృష్ణ మెహెర్‌బాబా సందేశాలపై ప్రసంగించారు. భోగి పండుగ సందర్భముగా శ్రీ బి.డి.నరశింహారావు గారి గృహంలో బాబా సంకీర్తన, బాబాకు భోగి పండ్లు సమర్పించి, చిన్నారులకు భోగి పండ్లు పోయటం జరిగినది. సుమారు గత 33 సంవత్సరముల నుండి ప్రతి భోగి పండుగ రోజున శ్రీ బి.డి.నరశింహారావు గారి ఇంటిలో బాబా సంకీర్తన మరియు భోగి పండ్ల కార్యక్రమము నిర్వహిస్తుండటం విశేషం!!

# బాబా జన్మదినోత్సవాలలో పండుగ పర్యటనలు

బాబా జన్మదినోత్సవాల సందర్భంగా బాబా ప్రేమికుడైన శ్రీ పండుగ రమణ, హైదరాబాద్, ఫిబ్రవరి 4 నుండి 26 వరకూ తెలుగు రాష్ట్రాలలో ప్రతిరోజూ ఒక్కొక్క బాబా కేంద్రంలో ఏర్పాటు చేసిన బాబా జన్మదినోత్సవ సత్సంగ్ కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా బాబా కేంద్ర కార్యక్రమ నిర్వాహకుల ఆహ్వానం మేరకు తెలంగాణాలోని పలు బాబా కేంద్రాలలో ఫిబ్రవరి 4 నుండి 9 వరకూ, ఆ పిదప ఫిబ్రవరి 10 నుండి 21 వరకూ ఉత్తరాంధ్రలోని నరసన్నపేట, సింగడాం, పార్వతీపురం, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, మచిలీపట్నం, చల్లపల్లి బాబా కేంద్రాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 22 నుండి 26 వరకూ హిందూపురం, తదితర రాయలసీమ జిల్లాలలో హాజరవుతున్నట్లు తెలిపారు.

# శ్రీనివాస హృదయగీతాలు




శ్రీ కె. శ్రీనివాస్, బెలగాం, పార్వతీపురం (8919174346) రాసిన హృదయగీతాలు హృద్యంగా వున్నాయి. స్వర్గీయ యం.యస్.రామారావు గారి హనుమాన్ చాలీసా బాణిలో శ్రీ శ్రీనివాస తన హృదయంలోని భావాలతో అవతారుడ్ని కీర్తిస్తూ రాసిన 21 అంశాల ప్రభువచనాలు బాబా ప్రేమికులు తప్పక చదవవల్సినది. ఈ 21 అంశాలను పాకెట్ బుక్ సైజులో అందంగా ప్రింట్ చేయించారు. అవతారుని జీవితచరిత్ర, ప్రార్థనలు, ఆరతితోపాటు బాబా సందేశాలు ఈ చిన్ని పుస్తకంలో పొందుపరిచారు. ఐతే, పుస్తకం ఖరీదు ప్రకటించలేదు. పుస్తకాలు కావల్సినవారు ప్రచురణకర్త, రచయిత శ్రీ కె. శ్రీనివాస, వివేక్‌కాలనీ, బెలగాం, పార్వతీపురం, విజయనగరం జిల్లా నుండి పొందగలరు.

# శ్రీ చిలుకూరి బాబాలో ఐక్యం



శ్రీ చిలుకూరి లక్ష్మీపతి, కాకినాడ, 2020 ఫిబ్రవరి 8న స్వల్ప అస్వస్థతతో అవతారునిలో ఐక్యమయ్యారని, వారి సోదరుడు శ్రీ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి చిలుకూరి సత్యవతి గారి రెండవ కుమారుడుగా స్థానిక బాబా ప్రేమికులందరికీ పరిచయస్తుడైన లక్ష్మీపతి నిరంతరం బాబా నామం తలుచుకుంటూ అవతారుని ఎడల అంచంచలమైన విశ్వాసంతో వుండేవారని శ్రీ మురళి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బంధు మిత్రులందరూ అవతారుడికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

# అవతార్ శ్రీ మెహెర్‌బాబా – బాలగోపాల




శ్రీ బాలగోపాల భాస్కరరాజు గారు **అవతార్ శ్రీ మెహెర్‌బాబా** పేరుతో బాబావారి జీవిత చరిత్రను సుమారు 240 పేజీలలో రచించి, 1966లో తొలిసారిగా ప్రచురించారు. కాగా ఈ పుస్తక ప్రతులు పూర్తిగా అలభ్యమైనప్పుడు, భాస్కరరాజు గారిని ఓ మంచి స్నేహితునిగా అభిమానించి ప్రేమించే పాలకొండ బాబా కేంద్రం వారు ఈ పుస్తకాన్ని తిరిగి 2019 నవంబరులో ద్వితీయ ముద్రణ చేశారు. అలా ముద్రిస్తూ ఈ పుస్తకంలోని మొదటి నాలుగైదు పేజీలలో పాలకొండ కేంద్ర స్థాపన విషయ ప్రస్తావన, ఆ తదుపరి బాబా కేంద్రంలో నిర్వహిస్తున్న పలు బాబా కార్యక్రమాల వివరాలు క్లుప్తంగా వివరించారు. ఈ పుస్తకంలోని 29వ పేజీ నుండి మరో నాలుగు పుటల వరకూ అవతారుని పరిచయం శీర్షికతో మెహెర్‌బాబా చూడ్డానికి ఎలా వుండేవారో బహు చాకచక్యంగా సహజ కవిపండితుడైన భాస్కరరాజు గారు స్పష్టంగా వివరించారు. బాబా గురించి చెబుతూ “ఆయన ఆజానుబాహుడు గాదు, మరి వామనుడునుగాదు. సుమారు అయిదున్నర అడుగుల ప్రమాణము గల్గిన లీలామానుష విగ్రహుడు. కమల వర్ణరంజితమైన దేహఛాయ, మోకాళ్ళకు దిగువగా వ్రేలాడు మల్లెపూవు వంటి ధవళాంగీతో ఏసుక్రీస్తును మరిపించు రూపసౌందర్యము. అనంత పవిత్రతకు తానే మూలమన్నట్లుదోచు నిరాడంబర పరిశుద్ధ ప్రశాంతమూర్తివంతము. చతురాశ్రమములలో బ్రహ్మచర్యము ద్వారా ఆధ్యాత్మికసిద్ధి సులభసాధ్యమన్నట్లు, ముముక్షువులకు నిరూపించుట కవతరించిన ఆదర్శ పావన బ్రహ్మచారి” ...అని భాస్కరరాజు గారు అవతారుడ్ని తన కవితాధోరణిలో వర్ణించారు. ఇంకా ఈ పుస్తకంలో నాలుగు అధ్యాయాల్లో అవతారుని సమగ్ర జీవితచరిత్రలోని అనేక ప్రధాన ఘట్టాల్ని అవతారుని సందేశాలు ఇతరత్రా చోటుచేసుకున్నాయి. అవతార్ మెహెర్‌బాబా పాలకొండ కేంద్రం తరపున శ్రీ గొర్లె కృష్ణం నాయుడు, శ్రీ కమలనాభం అప్పలనారాయణ భాగవతార్, తదితరలు ఈ అమూల్యమైన గ్రంధం మరికొన్నాళ్ళు బాబా ప్రేమికుల నడుమ వుండేలా పునర్ముద్రణ చేపట్టడం అభినందనీయం. ప్రతి బాబా ప్రేమికుడు ఈ గ్రంధాన్ని తన ఇంట వుంచుకోవాలి. కనీసం తీరిక చిక్కినప్పుడైనా తప్పక చదవాలనుకోవడం ముదాహహం. ఈ పుస్తకాల ప్రాప్తిస్థానం. అవతార్ మెహెర్‌బాబా కేంద్రం, పాలకొండ– 532 440, శ్రీకాకుళం జిల్లా.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

రాజపుతానా నౌక ఈజిప్టు తీరం చేరింది.
పోర్ట్ సయీద్‌లో లంగరు పడింది.
ఈ రేవు పట్టణానికి వో విశిష్టత వుంది.
మధ్యధరా సముద్రాన్నీ, అరేబియా సముద్రాన్ని కలిపే సూయజ్ కాలువ యిక్కడి నుంచే మొదలవుతుంది. ప్రపంచ ప్రఖ్యాత పిరమిడ్లు యిక్కడికి బాగా దగ్గర వో రెండు-మూడు గంటల దూరం అంతే.
అందుకనే పశ్చిమ దేశాల పర్యాటకులు పోర్ట్ సయీద్‌లో ఎప్పుడూ కన్పిస్తారు.
రాజపుతానాకి లంగరు పడేసరికి మూడు కొట్టింది గడియారం.
ఇంకో మూడు గంటలకి కానీ సూర్యోదయం కాదు.
అయినా సరే చాలా మంది వోడ దిగారు.
ఒడ్డుపై పచార్లు చేస్తున్నారు.
బాబావారు కూడా వో అరగంట సేపు పచార్లు చేసి వచ్చారు.
నడుం వాల్చారు. తెల్లవారితే సెప్టెంబరు 7వ తేదీ.
ఈ ఏడో అంకెకి మెహెరీశంలో వో విశిష్టత వున్న సంగతి పాఠకులకి తెలుసు.
ఇక్కడ, ఈజిప్టు నగరంలో ఆ విషయం మరోసారి రుజువయింది.
అది ఏలాగున అంటే, అది వో పత్రిక రచయిత పేరు చెప్పి.
బాబావారి గురించి విన్న స్థానిక విలేకరికి ప్రభువు మౌన విరమణ తేదీ తెలుసుకోవాలనిపించింది. ఫలానా రోజున మెహెర్‌బాబా మౌనం విరమిస్తారంటే, అది పతాక శీర్షిక, ఆ వార్తని నేనే పంపగలిగితే, నా పేరు వాడవాడలా మర్మోగి పోతుంది, పేరు ప్రఖ్యాతులు నా సొత్తు అవుతాయి అనుకొన్నాడు.
బాబావారిని కలవాలని శతాధ ప్రయత్నించాడు కానీ వీలు కాలేదు.
ఛాన్జీ కనిపించాడు వెంటనే నిలదీశాడు.
"మీకు తెలియక పోతే పోనీండి. మీ ప్రభువుని అడగండి సార్ నా తరపున,

ఆయన మాట నా చెవిన వేయండి", అని బ్రతిమాలాడు.
సరే, అడిగి చూస్తాను అన్నాడు ఖాన్ గారు.
విలేకరి ప్రశ్న బాబావారి చెవిన వేశాడు. ప్రభువు మాట అతనికి వినిపించాడు.
మాటలతో గారడి చేసే మన విలేకరి అవాక్కయ్యాడు.
ఇంతకీ ప్రభువు ఏమన్నారు అంటే.....
గొడుగు వేసుకొని వెడుతున్నావనుకో, గట్టిగా గాలి వీస్తే ఏమవుతుంది.
గొడుగు ఎగిరిపోవచ్చు. గట్టిగా పట్టుకొంటే, అటుకేసి, ఇటుకేసి పల్టీలు కొట్టవచ్చు.
అవునా? మరి గాలి లేదనుకో ఎండ బాగా వుందనుకో
ఎండ కాకపోతే, వర్షం పడుతోందనుకో
అప్పుడు నువ్వు ఇంచక్కగా గొడుగు వేసుకొని నడుస్తావ్.
అవునా! కాదా! మరి నేనయినా అంతే!
ఏ విషయంలో? మౌన విరమణ విషయంలో. గాలి వీయకూడదు.
కానీ వర్షం పడవచ్చు. ఎండగా వుంటే ఫరవా లేదూ. అలా ఎండకానీ వర్షం కాని
వున్నప్పుడే మౌనం విరమిస్తాను నేను, అన్నారుట బాబా.
ఇది కొంటె జవాబు అనుకోవాలా?
మహనీయుల భాష మానవులకి తలకెక్కదనుకోవాలా?
అన్న మీమాంసలో పడ్డాట్ట ఆ విలేకరి. ఎటూ తేల్చుకోలేక పోయాడు.
చెప్పినది చెప్పినట్లు వ్రాస్తే పోలే అనిపించింది.
వెంటనే బాబా మౌన విరమణ ఉవాచని తన పత్రికకి పంపాడు.
అలా ఆ ప్రకారంగా ఈజిప్టులో మెహెరీశుని నామవ్యాప్తికి కారకుడయ్యాడు.
ఇంతకీ ఆ విలేకరి పేరు చెప్పలేదు కదూ. అతని పేరు టెహ్మాన్ కేర్.
ఏ దేశస్థుడో తెలియదు. పోర్ట్ సయీద్‌లో వుంటున్నాడు కాబట్టి
ఈజిప్టు దేశస్థుడనుకోవాలి.
గాంధీ గారిని ఇంతవరకూ కలుసుకోలేదు.
మరి లండన్ చేరేలోగా వీరిద్దరూ కలుస్తారా, ఒక్కసారయినా?
ఏమో? అది విధాతకే తెలియాలి. గమ్మత్తు ఏమిటి అంటే,
సర్వం తెలిసిన విధాత ఈ ప్రశ్న వేస్తున్నారు ఈ మధ్య. అదీ తరుచు.
గాంధీని కలవాలన్న తహతహ కనిపిస్తోంది బాబా వారి మాటల్లో.
బాబా- గాంధీల సమావేశం వాళ్ళ చేతుల్లో లేదు కదా.
ప్రభువు తలుచుకొంటే క్షణంలో జరుగుతుంది.
గాంధీ ప్రభువు దర్శనానికి రాలేదు ఇంకా అంటే బహుశా
అందుకు ప్రభువు పచ్చ జండా యింకా వూపలేదేమో?

మెహెరీశంలో యిటువంటి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో.
మానవుని దేవునిగా మలచడానికి అవతరించిన మెహెరుడు ఈ మాటే అన్నారు.
దర్శనం యివ్వటం లేదనుకోండి, ఏం బాబా మాకు దర్శనం ఎందుకు యివ్వవు
అంటూ కంట తడిపెడ్తారు. మరి, నా విశ్వ కార్యక్రమం కోసం,
ఫలానా వ్యక్తులను కలవాలని నేను అనుకొన్నప్పుడు ఏమవుతుందో తెలుసా?
వాళ్ళెవరూ ఆసక్తి చూపరు, నా దర్శనానికి ఇప్పుడేకాదు ఎప్పుడూ యింతే అన్నారు.
ఇంకో మాట శెలవిచ్చారు.
గాంధీని ప్రస్తుతానికి కలవబోమన్న సంకేతం కూడా యిచ్చారు.
ఇంతకీ బాబా వారు ఏమన్నారు అంటే, గాంధీ ఎప్పుడో కలవాల్సింది.
జాప్యం అయింది బాగా కాబట్టి, ఇప్పుడు, ఆసంగతి
అదే గాంధీతో సమాగమం గురించి, మరచి పోదాము అన్నారు.
గాంధీని ఎందుకు కలవాలనుకొన్నారో వివరించారు.
మంచివాడు గాంధీ అన్నారు. నన్ను దర్శిస్తే అతనికే మేలు అన్నారు.
గాంధీ అంటే తమకి చాలా యిష్టం, అభిమానం అన్నారు.
అతని మేలు కోసమే కలవాలనుకొంటున్నా గాంధీని అని పేర్కొన్నారు.
కరాచీ మేయర్ జమ్‌షెడ్ మెహతా గారు గాంధేయవాదికదా.
మెహెరుని దర్శించమని చాలాసార్లు చెప్పాడు గాంధీకి ఆయన.
ఇప్పుడు వీరిద్దరూ వొకే వోడలో లండన్‌కి వెడుతున్నారు.
గాంధీ- మెహెరుల సమావేశం జరిగితే బాగుంటుందనిపించింది.
మెహెరుని దర్శించవలసిందిగా ప్రార్ధన అంటూ గాంధీ గారికి కేబుల్ పంపాడు.
స్నేహితుడి మాట కొట్టేయలేదు మహాత్ముడు.
సెప్టెంబరు ఎనిమిదవ తేదీ మంగళవారం తొమ్మిదింటికి గాంధీ
బాబా వారి క్యాబిన్‌కి వచ్చాడు.
ఆయన సెక్రటరి మహాదేవ్ దేశాయ్ కూడా వచ్చాడు వెంట.
బాబా వారి గురించి గాంధీ గారికి బాగానే తెలుసుట.
ఆ మాట ఆయనే స్వయంగా చెప్పారు. మీ గురించి చాలా చదివాను.
దేముడు అనుగ్రహిస్తే, ఏదో వొక రోజున మీ దర్శనం లభిస్తుందనుకొన్నాను కానీ
ఇంత త్వరగా మిమ్మల్ని కలుస్తాననుకోలేదు అని గాంధీ గారు అన్నారు.
బాబా వారు తమ ఆనందం వ్యక్తం చేశారు.
కాసేపు కూర్చోగలవా, అని అడిగారు.
అక్షర ఫలకంపై బాబా వేళ్ళు కదులుతుంటే, ఆశ్చర్యంగా చూశారు గాంధీ.
అదో వింత అనుభూతి మహాత్ముడికి. ఆ మాటే అన్నారు.

మీ దగ్గర కాసేపు కూర్చొందామనే వచ్చానన్నారు.
ఉపాసనీ మహరాజ్‌ని కలిశామన్నారు. అదొక వింత అనుభవం మహాత్ముడికి.
ఎప్పటికీ మరచిపోలేని చేదు అనుభవం అది.
అయితే ఆ వివరాల జోలికి వెళ్ళలేదు.
సాకోరీ వెళ్ళాను. మహారాజ్‌ని కలిశానన్నారు, చాలా ముక్తసరిగా.
ఉపాసనీ జీవిత చరిత్రని బాబావారు 1924లో వ్రాయించారు.
"సాకోరి నా సద్గురువు" అన్న పేరుతో గుజరాతీ భాషలో ప్రచురించారు.
బాబా ఆజ్ఞ మేరకి, రుస్తుం, ఆ పుస్తకాన్ని గాంధీకి పంపాడు. మహాత్ముడు చదివాడు.
మహరాజ్‌ని దర్శించాలనిపించింది. సాకోరీ వెళ్ళాడు. ఆ వేళ ఎందుకనో మహారాజ్
మూడ్ బాగాలేదు. గాంధీని దుర్భాషలాడాడు. సద్గురువుని దర్శించడానికి వస్తే
తిట్ల వర్షం కురిపిస్తున్నాడేమిటి? ఈవ్యక్తి అనుకొన్నారు.
గాంధీకి కోపం వచ్చింది. చిరాకు వేసింది. వెంటనే వెనుదిరిగాడు.
మళ్ళీ నీ దర్శనానికి రానని శపథం చేశాడు.
సద్గురువుల వ్యవహారశైలి అర్థం కాదు. చిత్రంగా కన్పిస్తుంది కూడా.
అకారణంగా సద్గురువులు ఏ పనీ చేయరు.
ఆ కారణాలు సామాన్యులకి అర్థం కావు.
అయినా, మెహెరుని కలవాలని వ్రాసి వుంటే,
గాంధీకి సాకోరి సద్గురువుతో పని ఏమిటి?
అందుకనే, బహుశా ఉపాసనీ మహారాజ్ గాంధీ గారిని దుమ్మెత్తిపోసి,
తరిమివేసి వుండవచ్చు. ఏది ఏమయితేనేం, అదొక చేదు అనుభవం.
మహాత్ముడికి  కోపం వచ్చింది. చిరాకు వేసింది. వెంటనే వెనుదిరిగాడు.
మళ్ళీ నీ దర్శనానికి రానని శపథం చేశాడు.
ఉపాసనీ ఆధ్యాత్మికోన్నతి తెలియజేశారు బాబా.
మహారాజ్ సద్గురు. నా గురువు అన్నారు.
బాబాజాన్ తమకి ముద్దాడి కల్గించిన ఆధ్యాత్మిక జాగృతి గురించి ప్రస్తావించారు.
పర్వర్దిగార్ అన్న సాయిబాబా పిలుపు, ఖండోబా గుడిలో మహారాజ్ దర్శనం,
సాకోరీ సందర్శన, మెహెరాబాద్ ఆశ్రమం, మొదలైన జీవిత విశేషాలని
తెలియజేశారు. ఉపవాసాలు, ఏకాంతవాసాలు తమ విశ్వకార్యక్రమంలో
భాగమన్నారు. గత ఆరేళ్ళుగా మౌనదీక్ష పట్టామన్నారు.
తామొక పుస్తకం వ్రాస్తున్నామన్నారు. సృష్టి రహస్యాల భాండారం ఆ పుస్తకం అన్నారు.
గాంధీ – ఆ పుస్తకం ఎక్కడ వుంది?
బాబా – అదిగో ఆ పెట్టెలో

గాంధీ- నేను చదవవచ్చా!

బాబా - మీకు అంత టైమ్ వుందా?

గాంధీ - తప్పకుండా చదువుతా. ఎందుకు చదవను.
టైమ్ అంటారా! ఏదోరకంగా వీలు చేసుకొంటా
మీరు ఇవ్వండి. నేను చదువుతాను.

బాబా వారి రహస్య గ్రంథాన్ని ఇంత వరకూ ఎవ్వరూ చూడలేదు. చదవలేదు. బాబా ఎవరికైనా యిస్తేగా చదవటానికి. ఈ పుస్తకం బాబా వారి వెంట చాలా వూర్లు తిరిగింది. ఇప్పుడు పశ్చిమ దేశాలకి వెడుతోంది. వ్రాత ప్రతి ఈ పుస్తకం యింకా. ఎప్పుడు ముద్రణకి నోచుకొంటుదో ఎవరికీ తెలియదు.

బాబావారు ఆ ప్రస్తావన చేయలేదు ఇంతవరకూ.

గాంధీ గారి మాతృభాష గుజరాతి.

బాబావారి మాతృభాష కూడా గుజరాతీనే. ఆ భాషలో పాటలు వ్రాశారు.

అందుకనే వీరిద్దరూ గోష్ఠి సాగింది గుజరాతీలో.. ఇంగ్లీషులో.

భగవదనుభూతి ఎలా లభిస్తుందో బాబావారు చెప్పారు.

ఈ దివ్యానుభూతి ఎక్కడవుందనుకొంటున్నారు.

ఇక్కడ అక్కడ అని లేదు ఎటుచూసిన దివ్యానుభూతి కన్పిస్తుంది.

సృష్టిలో మీకోమాట చెప్పనా? అసలు దివ్యానుభూతి తప్ప మరేమీ లేదు సృష్టిలో.

కానీ ఈ సంగతి తెలియదు అందరికీ అన్నారు.

పుస్తకాలు చదివితేనో, ప్రవచనాలు వింటేనో దివ్యానుభూతి లభించదు.

బలవంతంగా ప్రయత్నించినా వూడి పడదు ఇది.

నాకు దొరికి తీరాలి అంటే దొరకదు.

మరి ఎలాగా అంటారా?

భగవంతుడిని ప్రసన్నం చేసుకొంటే చాలు,

చిటికెలో దివ్యానుభూతిని పొందుతారు అని బాబా వివరించారు.

దివ్యానుభూతి కోసం తపిస్తున్న వ్యక్తి గాంధీ గారు.

సేవా మార్గాన్ని ఎంచుకొన్నాడాయన భగవంతుడిని చేరడానికి.

అందువల్ల బాబావారి మాటలని శ్రద్ధగా విన్నాడు.

తన మనసులో మాట చెప్పాడు.

నేను భగవంతుడిని నమ్ముతాను అంతా దైవేచ్ఛ అని నా అభిప్రాయం.

అలా అని ఏ పని చేసినా,

పని అంటే ఏ ఉద్యమం చేసినా, మంచి చెడుల భారం భగవంతుడిపై వేసి చేతులు దులుపుకోను. కార్యకర్తగా ఆ భారం నాదే. ఆ బాధ్యత నుంచి తప్పించుకోను.

అయినా నేనెవరిని నిమిత్త మాత్రుడిని అంటూ గాంధీ గారు తమ ప్రవృత్తిని వివరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే,
గాంధీ గారు అనేది ఏమిటీ అంటే, సర్వానికీ బాధ్యుడు ఆ పరంధాముడే.
అలా అని నా బాధ్యత ఏమీ లేదనుకోను.
నా బరువు బాధ్యతనాదే. ఈ భారం నేను మోస్తున్నాను అని.
బాబా శహభాష్ చెప్పలేదు.
సరికదా రెండు చురకలు వేశారు సుతిమెత్తగా.
నలుగురి కోసమే నేనేమి చేసినా అన్న దృక్పథం మంచిది కాదన్నారు.
నేను అది చేశాను యిది చేశాను, నా కోసం కాదు అందరికోసం.
ఐనా పర్యవసానం నాదే, నేను అనుభవిస్తాను, అన్న ఆలోచన వుండకూడదన్నారు.
అందువల్ల ఆధ్యాత్మిక మార్గంలో మేలు జరగదు సరికదా హాని కలుగుతుందన్నారు.
చెడ్డ సంస్కారాల ప్రభావంతో కృంగిపోతాడు సాధకుడు అని స్పష్టం చేశారు.
స్వాతంత్ర్య సాధన యజ్ఞంలో భాగంగా
గాంధీ గారు అనేక ఉద్యమాలు చేస్తున్నారు.
సహాయనిరాకరణ, చరక ఉద్యం, సత్యాగ్రహం,
యిలా అనేక కార్యక్రమాల్లో గాంధీ గారి పిలుపుపై లక్షలాది మంది పాల్గొంటున్నారు.
ఈ కార్యక్రమాలన్నింటికీ నేనే బాధ్యుడిని అని గాంధీ గారు అంటున్నారు.
కానీ ఉద్యమాల్లో పాల్గొంటున్న వారి సంగతి ఏమిటి?
వాళ్ళు నానా కష్టాలు పడటం లేదా?
ఈ సంస్కారాల భారం ఎవరిది. ఇది గాంధీ గారిదే కదా!
ఆధ్యాత్మిక మార్గంలో కొత్త సంస్కారాలు పడితే,
అదీ చెడు సంస్కారాలయితే, సాధకుడి పని ఏమవుతుంది?
ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు అవవచ్చు
ఇలా కావాలని ఎవరు కోరుకొంటారు.
సాధ్యమయినంత త్వరగా ముక్తి కావాలన్నదే కదా అందరి తపన.
అందుకనే, గాంధీ గారు బాబావారి హెచ్చరిక వింటూనే అప్రమత్తుడయ్యారు.
బాబా నన్నేమి చేయమంటారు యిప్పుడు, మీ సలహా ఏమిటి బాబా అన్నారు.
బాబా వారు చిరునవ్వునవ్వారు. తరుణోపాయం చెప్పారు.
గుండ్ర బల్ల (రౌండ్ టేబుల్) సమావేశానికి లండన్ బయలుదేరారు కదా.
ఆ సమావేశాలు అయ్యాక, వో పని చేయండి అన్నారు.
ఏదైనా ఏకాంత ప్రదేశానికి వెళ్ళి భగవధ్యానం చేయమన్నారు.
ఇరవై నాలుగు గంటలూ దేముడిని స్మరించమన్నారు.

మీ లక్ష్య సాధనకి మంచి మార్గమిదే నన్నారు.
సుళువైన మార్గం ఇదే అన్నారు.
గమ్యం త్వరగా చేరతారన్నారు. గాంధీ గారి మనస్సు కుదుటపడింది కాస్తంత.
బాబా వారు చెప్పిన సుదినం కోసం ఎదురు చూస్తామన్నారు.
గాంధీ గారిని తమ ఆశ్రమానికి రమ్మని బాబా ఆహ్వానించారు.
రాజకీయాలకి దూరంగా వుంటూ, ధ్యానం చేస్తున్న రోజుల్లో రండి నా దగ్గరకి.
నాతో వుండండి కొన్ని రోజులపాటు అన్నారు.
భగవంతుడు అనుగ్రహిస్తాడని నా నమ్మకం.
దైవానుగ్రహంతో దివ్యానుభూతి నా పరం అవుతుంది,
ఆ సుదినం కోసం ఎదురు చూస్తాను అన్నారు గాంధీ ఆత్మ విశ్వాసంతో.
మౌనవిరమణ ఎప్పుడు చేస్తారని అడిగారు.
"మీరు మాట్లాడుతుంటే చూడాలని వుంది బాబా" అన్నారు.
బాబా వారు చిరునవ్వు నవ్వారు. రహస్య గ్రంథం ప్రస్తావన మళ్ళీ వచ్చింది.
ఆ పుస్తకం ట్రంకు పెట్టెలో వుంది కదా.
పెట్టె వోడలో వస్తోంది కానీ, తాళం చెవి ఇండియాలో మంచి పోయారు.
ఈ మాటే బాబా వారు చెప్పారు. తాళం తీయిస్తానన్నారు గాంధీ.
పుస్తకం వున్న ఆ ట్రంకు పెట్టెని బాబా గాంధీకి యిచ్చారు.
తాళం తీయించాక పట్టుకు రండి పుస్తకాన్ని,
మీరు చదవవలసిన భాగాలని నేనే స్వయంగా సెలక్టు చేస్తానన్నారు.
"మహద్భాగ్యం", అన్నారు గాంధీ. పుస్తకం జాగ్రత్త అన్నారు బాబా!
ఎవరికీ యివ్వకండి చదవమని అన్నారు. మండలి వారు కూడా చదవలేదు యింత
వరకు. ఈ పుస్తకం చదువుతున్న మొదటి వ్యక్తి మీరేనన్నారు.
ఇది నా అదృష్టమన్నారు గాంధీ. "ఎవరికీ యివ్వను ఈ మహత్తర గ్రంధాన్ని అని
భరోసా యిచ్చారు. రేపు మళ్లీ మీ దర్శనానికి వస్తాను కదా అప్పుడు పట్టుకు వస్తా
ఈ గ్రంధాన్ని. మీరు ఏ భాగం చదవమని చెపితే, అదే చదువుతాను అన్నారు.
ఎరవాడ జైలులో వున్నప్పుడు 'మెహెర్ సందేశం' మాసపత్రిక వచ్చేది.
పెద్దగా చదవలేదు. ఏవో అక్కడ యిక్కడ చూసి ప్రక్కన పడేసేవాడిని కానీ
అప్పటి నుంచి మీ దర్శనం చేసుకోవాలనుకొంటున్నా. ఆ సుదినం నేటికి వచ్చింది.
మీ దర్శనంతో తరించాను అన్నారు గాంధీ వినమ్రంగా. కరాచీ మేయరు, జంషెడ్
మెహత గారి పుణ్యమా అని ప్రభుదర్శనం నేటికి సాధ్యమయిందన్నారు.
అతని కేబుల్ వల్లనే మీరు రాజపుతానాలో వున్నారని తెలిసింది.
కరాచీలోనే చెప్పి వుండవచ్చుగా ఈ సంగతి, ముందుగా తెలిసి వుంటే

మీతో ఎక్కువసేపు గడిపి వుండేవాడిని. మెహతాగారిని నిలదీస్తాను
మళ్లీ కలిసినప్పుడు. ఈ రాత్రి టెలిగ్రామ్ పంపిస్తా.
మీ దర్శనం చేశానని చెప్తాను. సంతోషిస్తాడతను అన్నారు గాంధీ.
దీనజనోద్ధరణికి గాంధీ గారు చేస్తున్న కృషిని బాబా శహభాష్ చెప్పారు.
నిరుపేదల కోసం మీ తపన, రైతులపట్ల మీ ప్రేమ శ్లాఘనీయం.
ఇదే నిజమైన సేవ, కానీ ఒక్క మాట. రైతులు, నిరుపేదలు పడుతున్న
ఇక్కట్లకి బాధ్యుడు ఎవరు? నేనే బాధ్యుడిని అనుకొంటున్నారు మీరు.
అటువంటి భావనలో కోట్టుకుపోవద్దు. ఆ భావన అనర్థాలకి దారి తీస్తుంది.
చెడు సంస్కారాలు మీద పడతాయి అని బాబావారు హెచ్చరించారు గాంధీని.
ఇంకో హితవాక్యం పలికారు. ఎవర్నీ నొప్పించకూడదన్న మీ ఆలోచన మంచిదే.
అందర్నీ సంతోషపెట్టాలన్న మీ తాపత్రయమూ మంచిదే.
కానీ ఇది సాధ్యమేనా? భారతదేశంలో మతాలు, కులాలు అనేకం.
మీరు హిందువులని సంతోషపెడితే, ముస్లిమ్‌లు నొచ్చుకొంటారు.
మరి ముస్లిమ్‌లని ఖుషీ చేస్తే, హిందువులకు నచ్చదు. భారతదేశంలో ఎన్నో రాజకీయ పార్టీలున్నాయి. మీరు అన్ని పార్టీలని మెప్పించ లేరు. కాంగ్రెస్ వాదుల సంగతి తీసుకోండి. ఇతర పార్టీలని మీరు సంతోషపెడితే, వాళ్ళు సహిస్తారా? వాళ్ళకి నచ్చదు కదా! మరి మీరేం చేయాలి? ఇదొక చిక్కుప్రశ్న. రాజకీయంగా, సామాజికంగా
మీ లక్ష్యం ఏమిటి? నలుగురికీ మంచి జరగాలని, మంచి చేయాలని.
ఇది ఉన్నతాశయం. శ్లాఘనీయం. సరే, నలుగురికీ మంచి చేయాలన్న మీ తపనకి వస్తున్న గుర్తింపు వుందే అదే చాలు. అదే అత్యున్నత బహుమానం మీకు.
అంతకంటే ఏమి కావాలి కాబట్టి. నా సలహా ఏమిటీ అంటే,
ఈవాళ్టి నుంచీ, మీరు వొక పని చేయండి. మీరు ఏ పని చేసినా, దేముడిపై భారం వేయండి. అయ్యో! వీళ్ళ కష్టానికి నేనే బాధ్యుడిని అని కొట్టుకు పోవద్దు.
భగవంతుడికి వదిలేయండి. అప్పుడు మీకు వొక అనిర్వచనీయమైన ఆనందం, తృప్తి కలుగుతాయి అని బాబా వారు మహాత్ముడికి హితవు చెప్పారు.
మెహెరు ప్రభుని మాటల్ని మహాత్ముడు శ్రద్ధగా విన్నారు.
మీరు చెప్పింది నిజమే కానీ అంటూ తమ మనస్సులో మాట చెప్పారు.
“నేనేమీ పరిపూర్ణుడిని కాదు. ఎన్నో లోపాలు, బలహీనతలున్నాయి నాలో కూడా. ప్రజలు తెలుసుకోవాలి ఈ వైనం. అప్పుడే నా లోటుపాట్లు సహించి నా వెంట రాగలుగుతారు. కాబట్టి నేనేం చేయాలి? నా లోటుపాట్లని ప్రజల ముందుంచాలి.
ఇదే సబబు. అయినా, అంతా భగవదేచ్ఛ ప్రకారమే జరుగుతుంది.
ఇది నా నమ్మకం అన్నారు. మెహెరీశుని మౌనదీక్ష ఆశ్చర్యం కల్గిస్తోందన్నారు.

నేను వారానికోరోజు మౌనం పాటిస్తాను.
మీరేమో ఏడేళ్ళుగా మాట్లాడటం లేదు.
మీ ముందు నేనెంత?
మీరు మౌన విరమణ చేస్తే ఏమి అద్భుతాలు జరుగుతాయో?
వూహించ లేను అన్నారు.
గడియారం పదిన్నర కొట్టింది.
బాగా పొద్దు పోయింది బాబా!
ఈవాళ్టికి శెలవు తీసుకొంటానన్నారు గాంధీ.
లండన్‌లో నా బసకి రండి. కాసేపు మాట్లాడుకోవచ్చు అన్నారు.
ప్రభువు సరేనన్నారు. మర్నాడు సెప్టెంబరు, తొమ్మిది.
ఆఘాఆలీ, రుస్తుం, ఖాన్ గార్లకు తమ గదికి పిలిపించారు బాబా.
వాళ్ళు వచ్చారు. మాటామంతీ అయ్యాక రెండు ఉర్దూ కవితలు వినిపించారు.
ఒక కవిత రచయితగా గాలిబ్.
రెండోకవిత రచయిత పేరు చెప్పలేదు
కాబట్టి తెలియదు. అతగాడు అజ్ఞాత కవిగానే మిగిలిపోతాడు మెహెరీశంలో.
ఇంతకీ ఆ కవితలకి అర్థం ఏమిటి పాఠక మహాశయా?
కాకి హంసలా నడవాలనుకొంది!!
కాకి కాకే కదా!
ఆ ప్రయత్నం పార లేదు కాకిలాగే నడిచింది.
అలానే, మహారాజ్ ఖుస్రో గారి ధర్మపత్ని, అదే మహారాణిని గాఢంగా ప్రేమించిన
షిరీన్ రాజు గారిని అనుకరించబోయి భంగపడ్డాడు.
ఇదీ కవిత.
ఇహ రెండవ కవితలో
ప్రేమికుడు అంటాడుట,
వో ప్రియా! మోసం చేయవని తెలుసుకానీ
నా ప్రేమనాలకించేసరికి నేనుండను. బూడిదనయి పోతాను.
ఈ రెండు కవితలని మెహెరీశుడు ఎందుకు గుర్తుకు చేశారో
ఆలీ ప్రభృతులకి అంతుపట్టలేదు.
ఏదో సంకేతం దాగి వుందని మాత్రం అనుకొన్నారు.
ఘనీ గారికి  ఈ కవితలు రెండూ యిష్టమైనవి
ఆయన తరుచు వినిపించేవాడు వాటిని.

**–సశేషం**

# మా ఆస్ట్రేలియా యాత్ర

## (డాక్టర్ మల్లాది కృష్ణానంద్, హైదరాబాద్)




(గత సంచిక తరువాయి)

ఆస్ట్రేలియాలో దేశంలోని సిడ్నీ పట్టణంలో వున్న "మెహెర్ హౌస్", క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలోని "అవతార్స్ ఎబోడ్" చాలా ముఖ్యమైన యాత్రాస్థలాలు. ఈ రెండు బాబా కేంద్రాలను మెహెర్‌బాబా స్వయంగా ప్రారంభించారు.

1956 ఆగస్టు 9 నుండి 14 వరకూ తొలిసారిగా మెహెర్‌బాబా ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్ పట్టణాలను సందర్శించారు.

మెహెరుడి రాక సందర్భంగా సిడ్నీలోని బీకాన్ హిల్సు ప్రాంతంలో నిర్మించిన **మెహెర్ హౌస్** స్థానిక బాబా ప్రేమికులు నిర్మించారు.

నేడు ఈ ప్రాంగణం సిడ్నీ బాబా కేంద్రంగా బాబా నామవ్యాప్తికి కృషి చేస్తోంది.

1958 జూన్ –జూలై నెలలో ఆస్ట్రేలియాలోని ఏదో ఒక ప్రాంతంలో అంతర్జాతీయ ప్రేమిక సహవాస్ నిర్వహించాలని మెహెర్‌బాబా నిర్ణయించారు.

మహారాష్ట్రలోని సతారాలో బాబావారికి రెండవసారి కారు ప్రమాదం




జరిగిన రోజులవి. (1956 డిశెంబరు).
సిడ్నీలో బాబా కేంద్రం ప్రారంభించి అప్పటికి రెండేళ్ళు నిండుతున్నాయి.
ఆస్ట్రేలియాకు బాబా వస్తున్నారంటే, బాబావారి బస, ప్రేమిక సహవాస్‌లను గతంలో మాదిరి మెహెర్ హౌసులోనే ఏర్పాటు చేయాలని భావించారు స్థానిక కార్యకర్తలైన ఫ్రానిస్ బ్రాబజాన్ తదితరులు.
కానీ, అనుకున్నదొకటి, అయ్యింది మరొకటి చందాన,
1958 జనవరి 11న బాబా సోదరి, మణీజా ఇరానీ ఫ్రాన్సిస్ బ్రాబజాన్‌కు ఓ లేఖ రాశింది. ఆ లేఖలో ఆస్ట్రేలియాలో సిడ్నీలో కాకుండా, మరొక అనువైన ప్రాంతంలో ప్రేమిక సహవాస్ నిర్వహించాలని ఆంకాక్షిస్తున్నారని, అందుకోసం ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌లో వాతావరణం అనుకూలిస్తే జూన్ నెలలో అక్కడ తగిన ఏర్పాట్లు చేయాలని బాబా సూచించినట్లు, ఆమె పేర్కొంది.
క్వీన్స్‌లాండ్ రాష్ట్ర రాజధాని బ్రిస్‌బేన్ పట్టణం. బ్రిస్‌బేన్ అందమైన నగరం.
సిడ్నీ నుండి బ్రిస్‌బేన్ సుమారు 800 కిమీ దూరంలో వుంది.
మీదుమిక్కిలి క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలో ఆనాడు బాబా ప్రేమికులు ఎవరూ లేరు.
మెహెరాజాద్ నుండి ఈ లేఖ అందగానే,
ఫ్రాన్సిస్ బ్రాబజాన్ ముందుగా బ్రిస్‌బేన్‌కు చేరుకుని,
అక్కడ తనకు పరిచయమున్నవారి ద్వారా బాబా సహవాస్ ఏర్పాటుకు అనువైన స్థలాల ఎంపికను చేపట్టాడు.

చివరాఖరకు, బ్రిస్‌బేన్‌కు సుమారు 80 కిమీ దూరంలో వున్న
కీల్ పర్వతశ్రేణిలో తగిన స్థలాన్ని ఎంపిక చేశారు.
99 ఎకరాల విస్తీర్ణంలో పైన్, యూకలిప్టస్ వృక్షాలతో నిండిన ఈ ప్రాంతం
బాబావారి సహవాస్ ఏర్పాటుకు అనువైన స్థలంగా భావించారు.
ఆపై ఈ స్థలాన్వేషణ – స్థల ఎంపిక విషయం తెలియజేస్తూ,
బాబావారి అంగీకారం కోరుతూ, ఓ సవివర కేబుల్ (టెలిగ్రాం) పంపారు.
బాబా కూడా ఆ వెనువెంటనే తన అంగీకారాన్ని కేబుల్ ద్వారా తెలియజేశారు.
ఆ పిదప, ఆ సంవత్సరం జూన్ నెలలో మెహెర్‌బాబా ఇక్కడకు వచ్చే సమయానికి
ప్రేమిక సహవాస్ కోసం తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఐతే, ఆనాడు
ఫ్రాన్సిస్ బ్రాబజాన్ తదితరులు ఈ ఏర్పాట్లు చేయడంలో
ఎంత కష్టపడివుంటారో ఊహకందని విషయమేమీ కాదు.
అసాధ్యం అనుకున్నదాన్ని సుసాధ్యం చేసినట్లేనని స్థానికులు చెప్పారు.
ఇక్కడ బాబా కోసం ఒక అందమైన గదిని, ఒక సమావేశ హాలు, అతిధుల కోసం
కొన్ని గదులు ఇతరత్రా నిర్మాణాలను ఎంతో శ్రమతో పూర్తిచేశారు.
మెహెర్‌బాబా బస చేసిన గదినే నేడు బాబా గదిగా పిలుస్తున్నారు.
బాబా ఇక్కడ 1958 జూన్ 3 నుండి నాలుగు రోజులు బస చేశారు.
ఆనాడు మెహెర్‌బాబాతోపాటు ఏరుచ్ జెస్సావాలా, నారిమన్ దాదా ఛాంజీ,
డాక్టర్ విలియం డాంకిన్, ఆదీ కె ఇరానీ మాత్రం వచ్చారు.

## బాబావారి గది

ఇక్కడ బాబావారి గదిని చాలా అందంగా తీర్చిదిద్దారు.
ఆనాడిక్కడ అవతారుడు విశ్రమించిన మంచంపై బాబావారి పాదుకలుంచారు.
నేలపై చక్కని మెత్తని కశ్మీరీ తివాచీలు పరిచారు.
20 20 అడుగుల విస్తీర్ణంలో గల ఈ గదిని, నిగనిగలాడే టేకు
నగిషీలతో కళకళలాడుతుంటుంది. ఆనాడు బాబావారు వినియోగించిన
కుర్చీలు, టేబుల్, ఇతర వస్తువులెన్నింటినో వీరిక్కడ బధ్రంగా పదిలపరిచారు.
ఎంతో ప్రశాంతంగా వుండే ఈ ప్రాంగణంలో అవతారుని గది
దివ్యకాంతులీనుతుంటుందని చెప్పాలి. ఒక్క క్షణం కళ్ళు మూసుకుని కూర్చుంటే
తదేక ధ్యానముద్రలోకి మనకు తెలియకుండానే వెళ్ళిపోతామని చెప్పాలి!!
అవతారుని దివ్యదర్శనం ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.
ఆనాటి సహవాస్ కార్యక్రమంలో సహవాసీల ఎదుట ఈ విశాల ప్రాంగణాన్ని
బాబాకు అంకితమిస్తున్నట్లు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ ప్రకటించాడు. ఐతే, ఉత్తరక్షణంలోనే

ఈ ప్రాంగణాన్ని తిరిగి ఫ్రాన్సిస్‌కు బదలాయిస్తున్నానని మెహెర్‌బాబా ప్రకటించారు. కాగా, ఇక్కడ వున్న రెండు కుటుంబాలవారు – రాబర్టు రౌజెస్, మరియు బ్రూఫోర్డ్‌లను ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ, ఈ ఎస్టేట్ బాగోగులు చూసుకోమని బాబా ఆదేశించారు. అలాగే, ఫ్రాన్సిస్ బ్రాబజాన్‌ను తనతోపాటు మెహెరాజాద్‌కు వచ్చి మండలి సభ్యునిగా వుండమని బాబా ఆదేశించారు. అలా 1958లో మెహెరాజాద్‌కు వచ్చిన ఫ్రాన్సిస్ బ్రాబజాన్ మెహెర్‌బాబా 1969 జనవరి 31న భౌతిక దేహ త్యాగం దాకా మెహెర్‌బాబాతో మెహెరాజాద్‌లో బాబా సేవలో, బాబా ప్రేమలో గడిపాడు. అవతారుడు **అవతార్స్ ఎబోడ్** పట్ల చాలా మక్కువ చూపించారని స్థానిక ప్రేమికులు చెప్తారు. 1969 దాకా, అంటే బాబా భౌతిక దేహం వదిలే వరకూ అవతార్స్ ఎబోడ్ నిర్వహణ బాధ్యత, కార్యక్రమాల నిర్వహణపై స్థానిక ప్రేమికులతో ఎప్పటికప్పుడు బాబా తగిన సూచనలు, ఆదేశాలు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ ద్వారా ఇచ్చేవారని చెప్పారు. 1967 ఫిబ్రవరిలో బిల్ లీపేజి మెహెరాజాద్‌కు బాబా పిలిపించారు. ఆ పిదప, బిల్ లీపేజిని అవతార్స్ ఎబోడ్ నిర్వహణ బాధ్యతతో పాటు, ఆస్ట్రేలియా ఖండంలో తన నామవ్యాప్తికి కృషి చేయమని బాబా ఆయన్ని ఆదేశించారు. ఈ విషయంలో బిల్ శషభిషలు లెక్కపెడ్తుంటే, “భయం వద్దు, నీకు నేనున్నాను, తగిన సమయంలో ఆ తాళం నేను తెరుస్తాను” అని బాబా అభయమిచ్చారు. ఆ దరిమిలా అవతార్స్ ఎబోడ్ బాధ్యతల్ని, ఈ ఆస్తికి సంబంధించిన దస్తావేజుల్ని బిల్ లీపేజి పేరున బదిలీ చేయించమని ఫ్రాన్సిస్ బ్రాబజాన్‌కు బాబా చెప్పారు. ఆ పిదప అవతార్స్ ఎబోడ్ పేరిట ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఎంపిక చేసిన కొందరు ట్రస్టీలు స్వచ్ఛందంగా అనేక బాబా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా బాబా బస చేసిన గది, బాబా సమక్షంలో ఆనాడు ఏర్పాటు చేసిన సహవాస్‌కు సంబంధించిన సమావేశమందిరం తప్పక దర్శించవల్సినవి. వీటన్నింటి నడుమ చక్కటి గార్డెన్స్, కాలిబాటలు, లైబ్రరీ, ఇత్యాది గదులను ఇటీవల కాలంలో సందర్శకులకు వీలుగా నిర్మించారు. అవతార్స్ ఎబోడ్ సందర్శించేందుకై విచ్చేసే బాబా ప్రేమికుల సౌకర్యార్థం కూడా చక్కని గదులు కొన్నింటి నిర్మాణం చేశారు. బాబా ఆదేశాల మేరకు కొందరు ప్రేమికులు తమ స్థిర నివాసం కోసం తమ ఇళ్ళు ఇక్కడ నిర్మించు కున్నారు. ఏడాది పొడుగూతా బాబా నామవ్యాప్తికై అనేక కార్యక్రమాలు వీరు చేపడుతున్నారు. ముఖ్యంగా 1958 జూన్ 3 నుండి 6 వరకూ బాబా ఈ ప్రాంగణానికి విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది జూన్‌లో వరుసగా నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ ప్రేమిక సహవాస్ ఇక్కడ నిర్వహిస్తున్నారు. సందర్శకుల కోసం ప్రతి రోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 6 వరకూ ఈ కేంద్రం తెరిచే వుంటుంది. భోజన, బస తదితర సౌకర్యాలు ఈ కేంద్రానికి దగ్గరలో వున్నాయి.

## అవతార్స్ ఎబోడ్ చేరుకోవడం ఎలా?

ఆస్ట్రేలియా దేశంలోని క్వీన్స్‌లాండ్ రాష్ట్ర రాజధాని బ్రిస్‌బేన్‌కు సుమారు 80 కిమీ దూరంలో వాంబే నగర సమీపంలో అవతార్స్ ఎబోడ్ 99 ఎకరాల విస్తీర్ణంలో కొలువుతీరి వుంది. అందమైన పసిఫిక్ మహా సముద్రతీరం ఇక్కడ్నుంచి సుమారు 6 కి.మీ. దూరంలో వుంది. ఇదొక చిన్న ద్వీపకల్పం. పర్యాటకుల స్వర్గధామం సన్‌షైన్ కోస్ట్. ఫ్రాన్సిస్ బ్రాబజాన్ సమాధి ఈ ప్రాంగణంలోనే వుంది. అవతారుని సేవలకే అంకితమైన ధన్యుడు ఫ్రాన్సిస్ బ్రాబజాన్. గొప్ప కవి, పండితుడిగా అవతారునిచేత ప్రశంశలందుకున్నాడు.

## ఉష్ణోగ్రత

ఇక్కడ చలికాలంలో 10 నుండి 24 డిగ్రీల ఉష్ణోగ్రత, వేసవిలో 25 నుండి 35 డిగ్రీలు వుంటుంది. జనవరి నుండి ఏప్రిల్ దాకా విస్తారమైన వానలు కురుస్తాయని అన్నారు. జూన్ నుండి ఆగస్టు వరకూ పగలు వెచ్చగానూ, రాత్రిళ్ళు చల్లగా వుంటుందన్నారు. ఆసక్తిగల బాబా ప్రేమికులకు వీలుగా తగిన వసతి సౌకర్యం కల్పించే వీలుందని, ఇందుకోసం విరాళంగా అమెరికన్ డాలర్లు 30 నుండి 60 వరకూ ఒక రాత్రికి చెల్లించాల్సివుంటుంది.

## అవతార్స్ ఎబోడ్ 62వ వార్షికోత్సవంలో పాల్గొనండి!!

2020 జూన్ 5 నుండి 8 వరకూ, అంటే నాలుగు రోజులపాటు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న 62వ వార్షికోత్సవం మరియు ప్రేమిక సహవాస్‌లో ఆసక్తిగల వారు, ఆర్థిక స్తోమతగలవారు తప్పక హాజరయ్యేలా ప్రయత్నించండి. అవతారుడు అత్యంత అందమైన ప్రాంతంగా అభివర్ణించిన ఈ సుందర ఆధ్యాత్మిక ప్రాంగణంతోపాటు, ఆస్ట్రేలియాలో అవతారుడు సందర్శించిన సిడ్నీ, మెల్‌బోర్న్ తదితర ప్రాంతాలను వీలుచూసుకుని పర్యటించేందుకు ప్రయత్నం చేయండి. రాబోయే 700 సంవత్సరాలలో ఈ ప్రాంతం ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతుందని బాబా అన్నారు.

## అవతార్స్ ఎబోడ్ లైబ్రరీని సందర్శించండి!!

ఇక్కడ వున్న లైబ్రరీని బాబా ప్రేమికులు తప్పక చూడవల్సినది. ప్రపంచంలో వున్న అన్ని మతాల గ్రంథాలను ఇక్కడ బధ్రపరిచారు. అంతేకాదు, మెహెరాబాద్‌లోని ఆర్కైవ్స్‌లో వున్న బాబా సాహిత్యం అంతటినీ ఇక్కడ వున్న గ్రంథాలయంలో డూప్లికేట్ కాపీలుగా కంప్యూటర్‌లలో బధ్రపరచే పనిలో ఇక్కడ ప్రేమికులు నిమగ్నమై వున్నారు. దీనికి కారణం ఏమంటే, అవతారుడు తిరిగి 700 సంవత్సరాలుకు వచ్చేనాటికి,

ఈ సాహిత్యం రాబోయే తరాలకు అందజేయాలన్నది ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు. అలాగే, ఏ కారణంగానైనా ప్రకృతి వైపరీత్యాలకు గురైతే అవతార్స్ ఎబోడ్‌లోని గ్రంధాలయం అక్కరకు వస్తుందన్న ఆలోచనగా ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇది వారి నిశిత దూరదృష్టికి నిదర్శనం. శ్రీమతి జెఫీ, టియాన్ గుంథర్ తదితరులు గ్రంధాలయ నిర్వహణ పర్యవేక్షిస్తున్నారు.

## శ్రీమతి జెఫీ - చైనా భాషలో బాబా సాహిత్యం


శ్రీమతి జెఫీ, టియాన్ గుంథర్

శ్రీమతి జెఫీ చైనా దేశీయురాలు. 1992 ప్రాంతంలో ఆస్ట్రేలియాలో ఉన్నత చదువులకై వచ్చి, ఆ తర్వాత మెహెర్ ఎబోడ్ గురించి, అవతారుని నామం విని క్వీన్స్‌లాండ్‌లో స్థిరపడింది. బాబా మండలి సభ్యులైన ఏరుచ్, భావూ కల్చూరీ ప్రసంగాలతో ఆకర్షితురాలై ఇంగ్లీషులో వున్న అవతారుని సాహిత్యాన్ని గత దశాబ్దకాలం పైగా చైనా భాషలోకి అనువదించినట్లు ఆమె తెలిపింది.

**చైనా భాషలో గాడ్ స్పీక్స్, లార్డ్ మెహెర్**

ఇంగ్లీషులో వున్న బాబా సాహిత్యాన్ని చాలా భాగం ఇప్పటికే చైనీ భాషలోకి అనువదించారు. లార్డ్ మెహెర్ అన్ని వాల్యూంలు అనువదించడానికి సుమారు 10 సంవత్సరాలు పట్టిందని, ఈ అనువాదంలో నలుగురు బాబా ప్రేమికులు పాల్గొన్నారని శ్రీమతి జెఫీ చెప్పారు. చైనా భాషలో లభ్యమౌతున్న బాబా సాహిత్యం గురించి చెబుతూ....GOD SPEAKS, LORD MEHER, DISCOURSES, MEHERA MEHERA, EVERYTHING AND NOTHING, INFINITE INTELLIGENCE, TIFFIN LECTURES, SPARKS & BEAMS

ఇంకా అనేక గ్రంధాలున్నాయని వివరించారు. శభాష్!! జైబాబా అని చెప్పాల్సిందే!! మరిన్ని వివరాల కోసం వారి వెబ్‌సైట్‌ను - **www.meherbaba.cn**
తప్పక సందర్శించండి. ఆశ్చర్యం వేస్తుంది.

**–ఈ శీర్షిక ముగిసింది.**

# శ్రీ గణేశ్వరరావు బాబాలో ఐక్యం



హైదరాబాద్ ప్రేమికురాలు శ్రీమతి తెన్నేటి కృష్ణవేణి గారి కుమారుడు శ్రీ తెన్నేటి గణేశ్వరరావు 2019 డిశెంబరు 31న స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాస విడిచారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. శ్రీ గణేశ్వరరావుకు పది సంవత్సరాల వయస్సులో పూణేలో జరిగిన ఈస్ట్-వెస్ట్ సమావేశంలో అవతారుని ఆలింగన భాగ్యం లభించిందని శ్రీమతి కృష్ణవేణి తెలిపారు. నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన గణేశ్వరావు ధన్యుడని బాబా ప్రేమికులు అన్నారు.

# శ్రీ గోపగాని పెదనర్సయ్య బాబాలో ఐక్యం



శ్రీ గోపగాని పెదనరసయ్య 2020 జనవరి 13న స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాస విడిచారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. శ్రీ నరసయ్య గారు నిరంతరం బాబా నామస్మరణలో గడిపేవారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు.

# శ్రీమతి మంత్రి ప్రగడ బాబాలో ఐక్యం

విశాఖ జిల్లా రేవిడి బాబా కేంద్ర వ్యవస్థాకులు శ్రీమతి మంత్రిప్రగడ బాలసరస్వతి 2020 జనవరి 31న ఉదయం 4.30కు బాబాలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం బాబా నామస్మరణలో వుండే శ్రీమతి బాలసరస్వతి గారి భర్త శ్రీ సత్య బాపిరాజు ఆమె తుదిశ్వాస విడిచే సమయంలో అమరతిథి వాలంటీర్ డ్యూటీలో వున్నారని, బాబా సేవలో - ప్రేమలో తరించిన శ్రీమతి బాలసరస్వతి ప్రాత:స్మరణీయురాలని, ఆమె ధన్యురాలని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు.

## కొత్త పుస్తకం
# బాబా ప్రేమికుల మధురానుభూతులు-3




శ్రీమతి మోటమర్రి శివనాగేశ్వరి ప్రసాద్, హైదరాబాద్ ప్రచురించిన "బాబా ప్రేమికుల మధురానుభూతులు - 3" సంచికను ఇటీవల జూబ్లి హిల్సు బాబా కేంద్ర వార్షికోత్సవం సందర్భంగా 2019 నవంబరులో లాంఛనంగా అవిష్కరించారు. శ్రీమతి శివనాగేశ్వరి సంకలనం చేసి ప్రచురించిన "బాబా ప్రేమికుల మధురానుభూతులు - 1, మరియు 2" సంచికలను 2017 నవంబరు, 2018 నవంబరులలో వరుసగా ప్రచురించారు. ఈ వరుస ప్రచురణలలో పలువురు బాబా ప్రేమికులు వారు బాబా పరిధిలోకి ఎలా వచ్చారు, వారి అనుభవాలు, అనుభూతులు ఎలా వున్నాయనే విషయాన్నే పలువురికి తెలియజేయాలన్నదే ప్రధానాంశంగా ఈ ప్రచురణ చేపట్టినట్లు తెలుస్తుంది. గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏడాది సంచికలో రమారమిన 15 మంది ప్రేమికులు చొప్పున తాము బాబా పరిధిలోకి ఎలా రాగల్గారో స్పష్టంగా తమ రచనల్లో పేర్కొన్నారు. ఈ ప్రేమికుల అనుభవాలు, అనుభూతులు చదువుతుంటే వారిని బాబా ఎన్ని విధాలుగా తమ దగ్గరకి రప్పించుకున్నారో అర్థమౌతుంది. యుగావతారుని లీలలు అనూహ్యమనిపిస్తుంది. ప్రస్తుత సంచిక "మధురానుభూతులు - 3లో" ప్రధానంగా శ్రీ సీతారామస్వామి, హైదరాబాద్, శ్రీ కొల్లి రామారావు, విజయనగరం, శ్రీ శుభాంగ్ ప్రసాద్, శ్రీమతి మెహెర్ నాగ సుధ, శ్రీ కె. జగన్నాధరావు, మల్కాజ్‌గిరి, శ్రీ బి.వి. సుబ్బారావు, గుంటూరు తదితరులు మొత్తం 14 మంది తమ అనుభూతుల్ని క్లుప్తంగా, స్పష్టంగా తెలియజేసే ప్రయత్నం చేశారు.

ఈ పుస్తకాన్ని ప్రతి బాబా ప్రేమికుడు తప్పక చదవవల్సినది. అలాగే ప్రతి ప్రేమికుని ఇంట వుండవల్సిన ఈ చిన్ని పుస్తకం వెల 10 రూపాయలు. పేజీలు-40. పుస్తకాలు కావల్సినవారు శ్రీమతి శివనాగేశ్వరి, 8-3-976/24, "రాఘవ", శాలివాహననగర్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్ - 500073, ఫోన్. 94918 73407 నుండి పొందవచ్చు. గత దశాబ్దంపైగా 2001 నుండి వరుసగా తాను అవతారుని కార్యక్రమాలపై సంకలనం చేసి ప్రచురిస్తున్న పుస్తకాలు అమ్మగా వచ్చిన నగదును జూబ్లి హిల్సు బాబా కేంద్రానికి విరాళంగా అందజేస్తున్నట్లు శ్రీమతి శివనాగేశ్వరి తెలిపారు.

***




# జయానగర్‌లో

బెంగళూరులోని జయానగర్‌లో శ్రీ ఏ. రాజగోపాల్ గారి ఇంట్లో ఏర్పాటు చేసిన బాబా కేంద్రంలో 2020 జనవరి 19, ఆదివారం ఉదయం 6 నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ ఏకనామం నిర్వహించినట్లు తెలిపారు. **ఓం పరబ్రహ్మ పరమాత్మ - అవతార్ మెహెర్‌బాబాకి జై అనే ఏకనామం సుమారు 8 గంటలు నిరంతరాయంగా** అద్భుతంగా జరిగిందని, ఆ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ పండుగ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 31న అమరతిథినాడు బాబా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీమతి నర్మద తెలిపారు.

# పూరి బాబా కేంద్రంలో

పూరి బాబా కేంద్రంలో ENDLESS JOURNEY OF LOVE వారి ఆధ్వర్యంలో స్థానిక ఉత్కళమణి శిశు శిష్య మందిర్‌లో స్కూలు విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసి, సర్టిఫికెట్లు అందజేసినట్లు స్థానిక బాబా ప్రేమికులు శ్రీ ప్రకాశ్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా ఈ సంస్థ తరఫున స్థానిక పాఠశాల విద్యార్థులకు ఆర్థిక సహాయంగా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని, ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రాంగణంలో అవతారుని ప్రేమిక సహవాస్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీ ప్రకాశ్‌రావు తెలిపారు.

# మచిలీపట్నం

అవతార్ మెహెర్‌బాబా మచిలీపట్నం సెంటరులో అవతార్ మెహెర్‌బాబా వారి 126వ జన్మదినోత్సవ కార్యక్రమములు 01.01.2020 నుండి 20.02.2020 వరకు నిర్వహించినట్లు ఆహ్వానం పంపారు.

# చల్లపల్లి

అవతార్ మెహెర్‌బాబా వారి 126వ జయంతి మహోత్సవము 25.02.2020 మంగళవారం అయి ఉన్నది. ఈ సందర్భముగా అవతార్ మెహెర్‌బాబా చల్లపల్లి సెంటరు వారిచే 01.02.2020 నుండి 25.02.2020 మంగళవారం వరకు 25 రోజులు పలువురు బాబా ప్రేమికుల గృహములలోను మరియు సెంటరు ప్రార్ధనా మందిరములోను బాబా భజనలు, ప్రార్ధనలు, మౌనము, ఉపన్యాసములు, హారతి మొదలగు కార్యక్రమములు నిర్వహించినట్లు శ్రీ పివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# కామారెడ్డి

అవతార్ మెహెర్‌బాబావారి 126వ జన్మదినోత్సవం సందర్భముగా కామారెడ్డి సెంటర్ బాబా ప్రేమికులు 23.10.2019 నుండి 25.02.2020 వరకు 126 రోజులు ఉదయం 5.30 గం॥ నుండి 6.00 గం॥ల వరకు నగర సంకీర్తన చేసినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమములో 100 నుండి 120 మంది పిల్లలు, స్త్రీ, పురుషులు పాల్గొన్నారు. మరియు ఈ సందర్భంగా అవతార్ మెహెర్‌బాబా ప్రేమికుల సహకారంతో ప్రతి నెల 2వ ఆదివారం మధ్యాహ్నం 12.30 నుండి అన్నదాన కార్యక్రమము నిర్వహించడమైంది. గత నాలుగు సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతముగా జరుపుకుంటున్నట్లు, ప్రతిసారి రమారమిన 350 మంది పేదలకు అన్నదానం నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# హ్యూమా పాటల పోటీలు

అవతార్ మెహెర్‌బాబా జన్మదినోత్సవాలను పురస్కరించుకుని హ్యూమా వాట్సప్ గ్రూపు వారు 2020 ఫిబ్రవరి 3 నుండి 20 వరకూ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్ధిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

## జీవిత సభ్యత్వం

**2020 ఫిబ్రవరి నెలలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | అశోక్, హిందూపురం, అనంతపురం జిల్లా, | 1000/- |
| 2. | డాక్టర్ వెంకట శేషయ్య, రామవరప్పాడు, విజయవాడ | 1000/- |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

వార్షిక సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్, ద్వారా పంపువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం.32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 **Dt.20-01-2020,** Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.